సంపుటి : 9
సంచిక : 343
శుక్రవారం
04 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

వరదల విలయం వేళ..

## టిబెట్‌లో భూకంపం



**సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవలే టిబెట్- నేపాల్ సరిహద్దులో జలప్రళయం సంభవించిన సంగతి తెలిసిందే. పెద్ద ఎత్తున సహాయక చర్యలు కొనసాగుతున్న తరుణంలోనే తాజాగా టిబెట్‌లో భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 5.0గా నమోదైనట్లు సమాచారం. 10 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం నమోదైంది. ప్రాణ, ఆస్తి నష్టం వివరాలు

మిగతా .. 2లో..

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధం

శాంతి ప్రయత్నాలకు భారత్ సిద్ధమే



**సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు మధ్యవర్తిత్వం సహా ఎలాంటి సహాయం అందించేందుకైనా భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పేర్కొన్నారు. ఆ రెండు దేశాలు కోరితే శాంతి స్థాపనకు కృషి చేస్తామన్నారు. యుద్ధక్షేత్రంలో ఈ వివాదం పరిష్కారం కాదు అనేది భారత్ వైఖరి అని మరోసారి

మిగతా .. 2లో..

## ట్రంప్‌నకు మళ్లీ షాక్..

జన్మత:పౌరసత్వం కొత్త ఆదేశాలూ నిలిపేసిన కోర్టు



**సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** జన్మతః పౌరసత్వం అంశంలో అమెరికా దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు మరోసారి న్యాయస్థానంలో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పౌరసత్వం లభించడంపై పరిమితులు విధిస్తూ ఆయన జారీ చేసిన కార్యనిర్వాహక ఉత్తర్వులను యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టు నిలిపివేసింది. విదేశీ వలసదారుల పిల్లలకు జన్మతః లభించే

మిగతా .. 2లో..

వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు

# నీటి విడుదలపై వైకాపా దుష్ప్రచారం

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు



**అమరావతి, సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** జలాశయాల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వట్లేదని గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని సీఎం చంద్రబాబు దుయ్య బట్టారు. వాటిని సమర్థంగా తిప్పికొట్టడంతోపాటు ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించాలని మంత్రులను ఆదేశించారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం మంత్రులతో సీఎం మాట్లాడారు. తాము చేసిన ప్రారంభోత్సవాలను వారి ఘనతగా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ప్రచారాలు చేయడంలో వైకాపా ముందుంటుందన్నారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపై ఆ పార్టీ దుష్ప్రచారం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వంచేసిన ప్రతి మంచీ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రులు నిత్యం ప్రజల్లో ఉంటూ వారికి అన్ని వాస్తవాలు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇంజినీరింగ్ అధికారులను సీఎం అభినందించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సమాచారం అందించాలని సీఎం చంద్రబాబు

మిగతా .. 2లో..

# క్రెడిట్ కొట్టేసేందుకే స్టంట్లు

కూటమి ప్రభుత్వంపై జగన్ ఆరోపణలు

సాగునీటి ప్రాజెక్టులపై కూటమి ప్రభుత్వాన్ని విమర్శించిన జగన్



**తాడేపల్లి, సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ, వాటిని పోలవరం ప్రాజెక్టు జలాలుగా చూపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. పురుషోత్తపట్నం పంపులు కానీ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్మించినవి కావని ఆయన స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం ఎడమ కాలువకు సంబంధించి 79 శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకుండా, గతంలో పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా లబ్ధి పొందాలని ప్రభుత్వం ఆరాటపడుతోందని జగన్ ఆక్షేపించారు. ప్రజాధనంతో ప్రాజెక్టుల వద్ద ప్రచార కార్యక్రమాలు, పబ్లిసిటీ స్టంట్లు నిర్వహించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.

అక్టోబర్ నెలలోనే

## స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

రాష్ట్ర మంత్రులతో సమావేశమైన నారా లోకేశ్

స్థానిక ఎన్నికలను వాయిదా వేసే ప్రసక్తి లేదని వెల్లడి

ఈ ఎన్నికలను వాయిదా వేయించేందుకు వైసీపీ కుట్రలు పన్నుతోందని విమర్శ



**అమరావతి, సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర మంత్రులతో విద్యాశాఖ మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కూటమి పార్టీల యంత్రాంగాన్ని సంపూర్ణంగా సన్నద్ధం చేయడం, కొత్త పింఛన్ల పంపిణీ ప్రక్రియతో పాటు శాఖాపరమైన పనితీరుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అక్టోబర్ నెల నుంచి దశలవారీగా కొత్త పింఛన్లు అందజేయాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పారదర్శకంగా

మిగతా .. 2లో..

వివేకా హత్య కేసులో

## రూ.40కోట్ల డీల్

అప్రూవర్ దస్తగిరిని ప్రశ్నిస్తున్న ఈడీ



**సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. అప్రూవర్‌గా మారిన దస్తగిరిని విచారి స్తోంది. వివేకా హత్య కేసులో ఎర్రగంగిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, దస్తగిరి మధ్య జరిగిన రూ.40 కోట్ల డీల్‌పై అధికారులు ప్రశ్నిస్తున్నారు. వివేకా హత్యకు ముందు, తర్వాత బ్యాంక్ లావాదేవీలపై ఈడీ ప్రత్యేక దృష్టిసారించింది. ఈ నేపథ్యంలో బ్యాంకు స్టేట్‌మెంట్లతో

మిగతా .. 2లో..

## చంద్రబాబు అపర భగీరథుడు

కత్తిపూడి సమీపంలో పోలవరం కాలువ జలాలకు పూజ చేసిన వర్మ

పట్టిసీమ ప్రాజెక్టును తలపెట్టినప్పుడు జగన్ వెకిలి నవ్వులు నవ్వారని మండిపాటు

వైసీపీ హయాంలో పురుషోత్తపట్నం పనులను పక్కన పెట్టారని విమర్శ



**పిఠాపురం, సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ అపర భగీరథుడిగా అభివర్ణించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా పోలవరం జలాలను మళ్లించి ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని చంద్రబాబు సస్యశ్యామలం చేశారని ప్రశంసించారు. కాకినాడ జిల్లా కత్తిపూడి సమీపంలో పోలవరం ఎడమ కాలువ జలాలకు ఈరోజు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వర్మ... చంద్రబాబు చేపట్టిన పాదయాత్రలోనే పురుషోత్తపట్నం ప్రాజెక్టు ఆలోచన రూపుదిద్దుకుందని గుర్తుచేశారు. ఆ తర్వాత రూ.1,650 కోట్ల అంచనా వ్యయంతో సీఎం చంద్రబాబు ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేశారని, పిఠాపురంలోనే దీనికి

మిగతా .. 2లో..

## రాజకీయ కక్షతోనే ఓటు తొలగింపు : రాఘవ్ చడాఢ



**సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** పంజాబ్‌లో చేపట్టిన ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణలో రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చడాఢ పేరును ఓటరు జాబితా నుంచి తొలగించడంపై రాజకీయ వివాదం చెలరేగింది. దీనిపై తాజాగా ఎంపీ స్పందించారు. ఇది రాజకీయ కక్షలో భాగమేనని మండిపడ్డారు. పార్టీ మారానన్న కోపంతోనే ఇలా చేశారని దుయ్యబట్టారు. ఈ మేరకు ఆయన

మిగతా .. 2లో..

## నల్సార్ విద్యార్థులకు ఊరట.. బార్ కౌన్సిల్‌పై 'సుప్రీం' ఆగ్రహం



**సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్సార్ యూనివర్సిటీ 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులు తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఆ ఆదేశాలను బీసీఐ ఛైర్మన్ మనన్‌కుమార్ మిశ్ర వెంటనే వెనక్కి

మిగతా .. 2లో..




## నన్ను బెదిరిస్తే భయపడను

తెలంగాణా రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** తననెవరూ బెదిరించవద్దని.. బెదిరిస్తే భయపడనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాతబస్తీలోని నల్గొండ ఎక్స్ రోడ్డు నుంచి ఒవైసీ జంక్షన్ వరకు నిర్మించిన భారీ స్టీల్ ఫ్లైఓవర్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి సీఎం పాల్గొని మాట్లాడారు. "బెదిరిస్తే భయపడను. స్నేహంతోనే నన్ను గెలవగలరు. నేను ఎవరికీ గులామ్‌ను కాదు.. దోస్తీకి మాత్రమే గులామ్‌ను. ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి.. గెలుపోటములు సహజం" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

**ఓల్డ్ సిటీ కాదు.. ఒరిజినల్ సిటీ**

ఈ వంతెన నిర్మాణానికి గత ప్రభుత్వం సకాలంలో

మిగతా .. 2లో..

పాలన పక్కనపెట్టి

## ఈవెంట్ మేనేజ్‌మెంట్

- ★ చంద్రబాబుపై గుడివాడ అమర్నాథ్ విమర్శలు
- ★ నీటిని పంప్ చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శ
- ★ నిజమైన ప్రాజెక్టు నిర్మాణాన్ని గాలికి వదిలేశారని ఆరోపణ



**విశాఖపట్నం, సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో పాలనను పూర్తిగా పక్కనపెట్టి కేవలం ప్రచార ఆర్భాటాలు, ఈవెంట్ మేనేజ్‌మెంట్‌తోనే ముఖ్యమంత్రి కాలం వెళ్లదీస్తున్నారని ధ్వజమెత్తారు. పోలవరం ప్రాజెక్టు పనులు ఇంకా ఏమాత్రం పూర్తి కాకపోయినా, అన్నీ పూర్తయినట్లు చిత్రీకరిస్తూ ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నారని ఆయన ఆగ్రహం

మిగతా .. 2లో..

హైకమాండ్‌ను సీఎం రేవంత్

## బ్లాక్‌మెయిల్ చేశారు

మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** తనను మంత్రివర్గం నుంచి తొలగించాలంటూ సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్‌ను బ్లాక్ మెయిల్ చేశారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. ఆమెను బర్తరఫ్ చేయాలంటూ గవర్నర్‌కు సీఎం లేఖ పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొండా సురేఖ మీడియా సమావేశం నిర్వహించారు. "నా వివరణ తీసుకోకుండా బర్తరఫ్ నిర్ణయం తీసుకున్నారు. ఉరిశిక్ష పడిన ముద్దాయిని కూడా చివరి కోరిక ఏంటని అడుగుతారు. ఏ తప్పు చేయకపోయినా.. ఎందుకు చేస్తున్నామో చెప్పకుండా నన్ను బర్తరఫ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మంత్రి పదవి నుంచి నన్ను తొలగించే ఉద్దేశం కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదు. ఆ విషయం నాకు వంద శాతం తెలుసు. కానీ.. సీఎం రేవంత్‌రెడ్డి హైకమాండ్‌ను బ్లాక్‌మెయిల్ చేశారు. ఆమెను మంత్రి పదవి

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# నీటి విడుదలపై వైకాపా దుష్ప్రచారం

సూచించారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు వివరించేందుకు అందరినీ భాగస్వాముల్ని చేద్దామన్నారు. నిత్యావసర ధరలు పెరగకుండా చూడాలని మంత్రులకు సీఎం సూచించారు. రైతు బజార్లలో బియ్యం తక్కువ ధరకు ఇస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల తెలిపారు. మిగిలిన వాటి ధరల నియంత్రణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. సీడ్ బాల్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను సీఎం ఆదేశించారు. స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందేలా ఇన్‌ఛార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. జిల్లాల్లో జఠిల సమస్యల పరిష్కారానికి వారిదే బాధ్యతని చెప్పారు. నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న 6 వేల ఎకరాలకు పట్టాలు లేవని, రెండు నెలల్లో సమస్య పరిష్కరించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూములు ఎక్కడున్నాయో గుర్తించి పట్టాలివ్వాలన్నారు. సూర్యఘర్ వినియోగంలో 4వ స్థానంలో ఉన్న ఏపీ మొదటి స్థానానికి రావాలన్నారు. 20 లక్షల కనెక్షన్లయినా వాడుకోవాలన్నారు.

**స్థానిక ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తిచేయాలి**

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలన్నీ ఈ ఏడాదిలోపు పూర్తి చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. వచ్చే ఏడాదికి ఏ ఎన్నికా మిగలకుండా కోర్టు సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. కోర్టు కేసులున్న 23 మున్సిపాలిటీలతో పాటు మిగిలిన 100 చోట్ల కూడా ఎన్నికలు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

## టిబెట్‌లో భూకంపం

తెలియరాలేదు. మరోవైపు.. ఆగస్టు 26 నాటి ఆకస్మిక వరదలకు సంబంధించి నేపాల్, టిబెట్‌లలో కలిపి మృతుల సంఖ్య 1,273కు పెరిగింది. నేపాల్‌లో 1,252 మంది, టిబెట్‌లో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరువైపులా 4,700 మందికిపైగా గల్లంతయ్యారు. నేపాల్‌లో 4,216 మంది, టిబెట్‌లో 541 మంది ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదు. వరదల ధాటికి టిబెట్‌లో గల్లంతైన వారిలో 104 మంది నేపాలీ పౌరులు, 49 మంది భారతీయులు ఉన్నట్లు చైనా ప్రభుత్వం వెల్లడించింది.

**అది హిమాలయ సునామీ'..**

ఇటీవల సంభవించిన ఆకస్మిక వరదలను 'హిమాలయ సునామీ'గా నేపాల్ విదేశాంగశాఖ మంత్రి శిశిర్ ఖనాల్ పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో ఇంతటి భారీ విపత్తును తాము చూడలేదని చెప్పారు. భోటేకోశి నది వరదల వల్ల జరిగిన విధ్వంసం గురించి కాఠ్‌మాండూలోని అంతర్జాతీయ దౌత్యవేత్తలకు ఆయన వివరించారు. విపత్కర సమయంలో అండగా నిలిచినందుకు పొరుగు దేశాలకు, అంతర్జాతీయ సమాజానికి ధన్యవాదాలు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో గాలింపు, సహాయక చర్యలను ముమ్మరం చేశామని, పౌరులను కాపాడటమే ప్రభుత్వ ప్రాధాన్యమని చెప్పారు.

## రష్యా-ఉక్రెయిన్ యుద్ధం

స్పష్టం చేశారు. సంప్రదింపులు, దౌత్యపరమైన చర్చలతోనే వీటికి ముగింపు ఉంటుందన్నారు. షాంఘై కో-ఆపరేషన్ ఆర్గనైజేషన్ సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ప్రధాని మోదీ భేటీ అయిన కొన్ని రోజులకే విదేశాంగ మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం ఉక్రెయిన్ పర్యటనలో ఉన్న ఎస్ జైశంకర్.. ఆ దేశ విదేశాంగ మంత్రితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వాణిజ్య నౌకలపై ఇటీవల జరుగుతున్న దాడులు, నల్ల సముద్రంలో భద్రతా పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా భారత నావికులపై జరుగుతున్న దాడులపై జైశంకర్ ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదిలాఉంటే, మూడు రోజుల పర్యటనలో భాగంగా విదేశాంగ మంత్రి జైశంకర్ సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు ఉక్రెయిన్, పోలాండ్‌లలో పర్యటించనున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం.. ప్రాంతీయ, అంతర్జాతీయ భద్రతా పరిస్థితులపై ఆయా దేశాల దౌత్యవేత్తలతో చర్చించనున్నారు.

## ట్రంప్‌నకు మళ్లీ షాక్..

పౌరసత్వాన్ని పరిమితం చేసేలా, బర్త్ టూరిజాన్ని నిషేధించాలనే లక్ష్యంతో ఇటీవల ట్రంప్ కొత్త ఉత్తర్వులపై సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే జన్మతః పౌరసత్వం అంశంలో ట్రంప్‌నకు సుప్రీంకోర్టులో షాక్ తగిలింది. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలు కలిగిన వారి పిల్లలు అమెరికాలో జన్మిస్తే.. వారిని పౌరులుగానే పరిగణించాలని తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. విదేశీయుల పిల్లలకు పౌరసత్వం నిరాకరించాలనే ట్రంప్ ప్రయత్నం అప్పటికి వీగిపోయింది. కానీ, ఆయన మళ్లీ కొత్త ఉత్తర్వులు ఇచ్చినా ప్రయోజనం లేకపోయింది.

**యూఎస్ చట్టాలు ఏం చెప్తున్నాయంటే..?**

1868లో ఆమోదించిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం-అమెరికాలో పుట్టేవారందరికీ (వారి తల్లిదండ్రులు ఆ దేశంలో అక్రమంగా లేదా తాత్కాలికంగా ఉంటున్నా సరే) ఆ దేశ పౌరసత్వం లభిస్తుంది. అయితే బర్త్ టూరిజం పేరిట దీనిని దుర్వినియోగం చేస్తున్నారని.. ఇది దేశానికి అవమానకరమని ట్రంప్ వాదిస్తున్నారు. పుట్టబోయే బిడ్డకు విదేశీ పౌరసత్వం పొందాలనే లక్ష్యంతో నెలలు నిండే సమయంలో గర్భిణీ స్త్రీలు వేరే దేశానికి ప్రయాణించి అక్కడ ప్రసవించడాన్ని బర్త్ టూరిజంగా పేర్కొంటున్నారు.

## స్థానిక ఎన్నికలు, కొత్త పింఛన్లు

అర్హులకు లబ్ధి చేకూర్చాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఎట్టి పరిస్థితుల్లోనూ వాయిదా వేసే ప్రసక్తే లేదని, అక్టోబర్ నాటికే సమగ్ర ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని లోకేశ్ తేల్చి చెప్పారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న అంశాలను ప్రభుత్వం చట్టబద్ధంగా త్వరితగతిన పరిష్కరిస్తోందని తెలిపారు. మొదట పురపాలక (మున్సిపల్), ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, చివరగా పంచాయతీ ఎన్నికలు క్రమపద్ధతిలో జరుగుతాయని వెల్లడించారు. స్థానిక ఎన్నికలను వాయిదా వేయించి, కేంద్ర ఫైనాన్స్ కమిషన్ నిధులు నిలిచిపోయేలా చేసి రాష్ట్రానికి నష్టం చేకూర్చాలనే లక్ష్యంతో వైసీపీ ఆడుతున్న 'గొడ్డలి రాజకీయాల' కుయుక్తులు ఎంతమాత్రం సాగవని మండిపడ్డారు. అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా నాయకులు పనిచేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు విద్య, సంక్షేమ, వైద్య శాఖలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యర్థులు పన్నుతున్న కుట్రలు, సోషల్ మీడియా ట్రోలింగ్‌ల పట్ల మంత్రులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ప్రవర్తించే, మాట వినని అధికారులపై కఠినంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, సెప్టెంబర్ 9తో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడిపై అక్రమ కేసులు బనాయించి అన్యాయంగా నిర్బంధించి మూడేళ్లు పూర్తవుతున్న సందర్భంగా... ఆనాటి కక్షసాధింపు చర్యల నుంచి రాష్ట్రం సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించేలా ప్రత్యేక కార్యక్రమానికి రూపకల్పన చేయాలని నిర్ణయించారు. ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి కొరతను ముందస్తు పొదుపు చర్యలతో అధిగమించాలని మంత్రులకు సూచించారు.

## వివేకా హత్య కేసులో రూ. 40కోట్ల డీల్

దస్తగిరి విచారణకు హాజరయ్యారు. తనకు రూ.5కోట్లు ఇస్తామని చెప్పినట్టు గతంలో దస్తగిరి సీబీఐకి తెలిపారు. నాడు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

## చంద్రబాబు అపర భగీరథుడు

శంకుస్థాపన జరిగిందని వివరించారు. ఈ ప్రాజెక్టు పనులను అడ్డుకోవడానికి, నిలిపివేయడానికి గతంలో వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏకంగా కేంద్రానికి లేఖలు రాశారని మండిపడ్డారు. గతంలో పట్టిసీమ ప్రాజెక్టును తలపెట్టినప్పుడు జగన్ మోహన్ రెడ్డి వెకిలి నవ్వులు నవ్వారని, సుజల స్రవంతి ప్రాజెక్టును సైతం అడ్డుకుని ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం చేశారని నిప్పులు చెరిగారు. చంద్రబాబుకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న అసూయతోనే పురుషోత్తపట్నం పనులను వైసీపీ హయాంలో పక్కనబెట్టారని విమర్శించారు. పురుషోత్తపట్నం ప్రాజెక్టు వల్ల ఏలేరు ఆయకట్టు పరిధిలోని ఐదు నియోజకవర్గాల రైతులకు నిరంతర సాగునీరు అందుతుందని చెప్పారు. ఈ పథకం ద్వారా సుమారు లక్ష ఎకరాల్లో రెండు పంటలకు అవసరమైన నీరు సమకూరుతుందని హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పురుషోత్తపట్నం నుంచి పోలవరం లెఫ్ట్ కెనాల్ ద్వారా 3,400 క్యూసెక్కుల నీరు అనకాపల్లికి చేరుకుందని, గ్రావిటీ ద్వారా తుని ప్రాంతానికి కూడా సాగునీరు సమృద్ధిగా వెళ్తోందని తెలిపారు.

## రాజకీయ కక్షతోనే ఓటు తొలగింపు : రాఘవ్ చడాఢ

ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. శాశ్వతంగా వలస వెళ్లినవారిగా పేర్కొంటూ మొహాలీ ఓటరు జాబితా నుంచి తన పేరు తొలగించారని చడాఢ పేర్కొన్నారు. తాను పంజాబ్ నుంచి ఎన్నికైన రాజ్యసభ సభ్యుడినని అన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల కోసం సర్ మార్గదర్శకాల్లో ప్రత్యేక నిబంధన ఉన్నప్పటికీ, పంజాబ్ అధికారులు దానిని ఉల్లంఘించారని ఆరోపించారు. ఇది సాధారణ పొరపాటు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఇది ముసాయిదా జాబితా మాత్రమే అని, దీనిపై తాను అభ్యంతరాలు తెలియజేస్తానని ఆయన వెల్లడించారు. ఇదిలా ఉండగా.. చడాఢ ఆరోపణలను ఆమ్ ఆద్మీ పార్టీ ఖండించింది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తిగా ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోనే జరుగుతోందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వ పాత్ర లేదని స్పష్టం చేసింది. కాగా.. పంజాబ్‌లో ఇటీవల సర్ ముసాయిదా జాబితా విడుదలైంది. ఇందులో సుమారు 20.66 లక్షల మంది పేర్లను ఓటరు లిస్ట్ నుంచి తొలగించారు.

## నల్సార్ విద్యార్థులకు ఊరట.. బార్ కౌన్సిల్‌పై 'సుప్రీం' ఆగ్రహం

తీసుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న సుప్రీంకోర్టు.. గురువారం జరిగిన విచారణలో బీసీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే చట్టబద్ధ అధికారం లేదని స్పష్టం చేసింది. దీంతో ఆ విద్యార్థులకు భారీ ఊ నల్సార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించేలా నిర్ణయం తీసుకోవద్దని పలువురు విద్యార్థులు లేఖ రాసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ వ్యవహారంపై మూడురోజుల్లోగా పూర్తి నివేదికను సమర్పించాలంటూ మిశ్ర తొలుత వర్సిటీ వీసీని ఆదేశించారు. 2026 బ్యాచ్ న్యాయశాస్త్ర విద్యార్థులెవరినీ న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ దేశవ్యాప్తంగా ఉన్న బార్ కౌన్సిళ్లకు లేఖ రాశారు. అయితే, దీనిపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. విద్యార్థులతో తనకు జరుగుతున్న సంవాదంలో జోక్యం చేసుకోవడానికి బీసీఐ ఎవరు అని సీజేఐ సైతం ఆగ్రహం వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే.

## నన్ను బెదిరిస్తే భయపడను

నిధులు ఇవ్వలేదని సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి త్వరగా వంతెన పూర్తిచేసిందని చెప్పారు. తమ ప్రాంత అభివృద్ధి కోసం అసదుద్దీన్ ఒవైసీ ప్రభుత్వంతో పోరాటానికైనా సిద్ధంగా ఉంటారన్నారు. "ఈ ప్రాంతమంతా ఓల్డ్ సిటీ కాదు.. ఇది ఒరిజినల్ సిటీ. పాతబస్తీలో అణువణువూ నాకు తెలుసు. మీరాలం ట్యాంక్‌పై రూ.500 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. అది పూర్తయితే పర్యాటకంగా, రవాణాపరంగా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ఇప్పటికే ఆరాంఘర్, మూసారాంబాగ్ వంతెనల నిర్మాణం పూర్తిచేశాం. పాతబస్తీ మెట్రోను పూర్తిచేస్తామని చెప్పాం.. చేసి చూపిస్తాం. నాలాలపై ఆక్రమణలను తొలగించి ముంపు సమస్య లేకుండా చేస్తాం. ఎక్కడైనా పేదల ఇళ్లు తొలగిస్తే.. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకుంటాం. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ప్రతి నెలా రేషన్‌కార్డులపై సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం"అని రేవంత్ అన్నారు.

**రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతు: అసదుద్దీన్**

అంతకుముందు అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధికి అన్నివిధాలుగా సహకరిస్తామని చెప్పారు. సీఎం రేవంత్ నేతృత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలన్నారు. రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు మద్దతిస్తున్నామని వ్యాఖ్యానించారు. ఆయన తనదైన పంథాలో పరిపాలన చేయాలన్నారు.

## ఈవెంట్ మేనేజ్‌మెంట్

వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమర్నాథ్ మాట్లాడుతూ... పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించడానికి కూటమి ప్రభుత్వం అంగీకరించడం ద్వారా రాష్ట్ర ప్రజలను, ముఖ్యంగా ఉత్తరాంధ్ర వాసులను దారుణంగా వంచించిందని విమర్శించారు. సహజసిద్ధంగా గ్రావిటీ ద్వారా రావలసిన నీటిని పంపింగ్ సిస్టమ్ ద్వారా తెచ్చి, ఏదో గొప్ప ఘనత సాధించినట్లు ప్రచారం చేసుకోవడం కూటమి ప్రభుత్వ డ్రామాలకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. పోలవరం కాలువల నిర్మాణంలో చంద్రబాబు నాయుడి పాత్ర ఏమీ లేదని... దివంగత వైఎస్సార్, వైసీపీ అధినేత జగన్ హయాంలోనే మెజారిటీ పనులు పూర్తయ్యాయని చెప్పారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించినట్లే... చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును తన స్వార్థ రాజకీయాలు, కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసం ఒక 'ఏటీఎం'లా వాడుకుంటున్నారని అమర్నాథ్ తీవ్ర ఆరోపణలు చేశారు. నిజమైన ప్రాజెక్టు నిర్మాణాన్ని గాలికి వదిలేసి, సొంత అనుకూల వర్గాలకు పనులు కట్టబెడుతూ, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఉత్తరాంధ్రలో విద్యా, వైద్య రంగాల పురోగతికి జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే పునాదులు పడ్డాయని గుర్తుచేసిన ఆయన, కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రచార ఆర్భాటాలను ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

## బ్లాక్‌మెయిల్ చేశారు

నుంచి తొలగిస్తారా? నన్ను రాజీనామా చేయమంటారా? అని సీఎం బెదిరించారు. నాతో పాటు మాజీ ఓఎస్డీ సుమంత్‌పై కుట్ర చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం సోదరులు కొండల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి కక్షగట్టారు. నాకు తెలియకుండా సుమంత్‌ను తప్పించారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి ఆయన కుటుంబాన్ని ఇబ్బంది పెడుతున్నారు.

**నేను తప్పు చేయలేదు.. అవమానంగా భావించను**

నాపై చర్యలకు సిఫార్సు చేసిన క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి కూడా గతంలో కాంగ్రెస్‌ను తిట్టినవారే. గతంలో రోశయ్య, జైపాల్‌రెడ్డి కూడా ఇందిరాగాంధీని దూషించారు. మంత్రి పదవి నుంచి తొలగించినందుకు నేనేమీ బాధపడట్లేదు. నేను తప్పుచేయలేదు.. బర్తరఫ్‌ను అవమానంగా భావించడం లేదు. మేం ప్రజాబలం ఉన్న నాయకులం.. జనం మా వెంటే ఉంటారు. మంత్రులు, ఎమ్మెల్యేలూ.. మీరు సంతోషంగా ఉన్నారా?గుండెల మీద చేయి వేసుకుని చెప్పాలి. బయటకు వచ్చి మీ బాధలు చెప్పుకోండి. ప్రజాప్రతినిధులకే పనులు జరగని పరిస్థితి నెలకొంది.

**కాంగ్రెస్‌కు రాజీనామా చేసే ఆలోచన లేదు**

హామీలు నెరవేర్చకపోవడం వల్ల ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది. క్షేత్రస్థాయి పరిస్థితిపై ప్రభుత్వం సర్వే చేయించుకుంటే మంచిది. ఇప్పటికైనా అందరూ బయటకు వచ్చి ధైర్యంగా మాట్లాడాలి. పనులు జరగాలంటే ఎవరి వద్దకు వెళ్లాలో తెలియని స్థితిలో ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రజలకు సేవ, ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేకపోతున్నామనే బాధ అందరిలోనూ ఉంది. బర్తరఫ్‌పై పునరాలోచించుకోమని చెప్పను.. పార్టీ తీరు మారాల్సిన అవసరముంది. మళ్లీ కాంగ్రెస్ పార్టీ గెలవాలంటే చాలా మార్పులు చేసుకోవాలి. రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు. నావైపు ఒక వేలు చూపితే.. రేవంత్ వైపు నాలుగువేళ్లు చూపుతాయి. ప్లాన్-బిపై ఇంకా ఏమీ ఆలోచించుకోలేదు. ఎమ్మెల్యేగా కొనసాగుతా. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసే ఆలోచన లేదు" అని కొండా సురేఖ అన్నారు.

**దృఢంగా నిలబడతాం: కొండా మురళి**


కొండా సురేఖ బర్తరఫ్‌పై ఆమె భర్త, కాంగ్రెస్ నేత కొండా మురళి 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'ఇదేం కొత్త కాదు. ఉన్నది ఉన్నట్టు కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడితే ఎవరూ తట్టుకోరు! ఇవ్వాళ మేము. రేపు ఎవరో. పదవులు ఉన్నా లేకున్నా మా గౌరవం మాకు ఉంటుంది. మేము ప్రతిదానికి స్పందించకపోవచ్చు. కానీ ప్రతి ఒక్కటి గమనిస్తూనే ఉంటాం. అన్ని దరిద్రాలు ఏకమై మా మీద దాడి చేస్తున్నా.. చేసినా రాజకీయ దాడులను ఎదుర్కొని దృఢంగా నిలబడతాం. మొండిగా ఎదురు వెళ్లగలం' అని పోస్టు చేశారు.

---

### రూ.5 కోట్ల అక్రమాస్తులు..

# టీటీడీ డిప్యూటీ ఈవో లోకనాథం అరెస్ట్

**నిన్న ఉదయం నుంచి లోకనాథం, ఆయన బంధువుల ఇళ్లలో ఏసీబీ సోదాలు**
**బంగారం, వెండి, విలువైన స్థలాలు గుర్తింపు**
**సోదాలు ముగిసిన వెంటనే అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు**



**తిరుపతి, సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) డిప్యూటీ ఈవో లోకనాథంను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. ఆదా యానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలతో ఆయనను అదుపులోకి తీసుకున్న అధికారులు, అనంతరం తదుపరి విచారణ నిమిత్తం ఏసీబీ కార్యాలయానికి తరలించారు. నిన్న ఉదయం నుంచే తిరుపతి ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఐదు ప్రత్యేక బృం దాలుగా ఏర్పడి లోకనాథం నివాసంతో పాటు ఆయన బంధువుల ఇళ్లలోనూ విస్తృత సోదాలు నిర్వహించారు. సుదీర్ఘంగా సాగిన ఈ తనిఖీల్లో దాదాపు రూ. 5 కోట్ల విలువైన అక్రమ ఆస్తులను ఏసీబీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. తనిఖీల సమయంలో ఆయన నివాసంలో 2 కిలోల బంగారం, 6.5 కిలోల వెండి, రూ. 12.50 లక్షల ద్రవ్య నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు ఆయన భార్య, కుమారుడి పేర్లతో పలుచోట్ల ఇళు ,, విలువైన స్థలాలు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. నిన్న ప్రారంభమైన సోదాలు ముగిసిన వెంటనే, ఈరోజు ఆయనను అరెస్ట్ చేశారు. టీటీడీ కీలక అధికారిని ఏసీబీ అరెస్ట్ చేయడం ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతిలో తీవ్ర కలకలం రేపింది.


# మోదీ కోసం ఆ గిఫ్ట్ ఇద్దామనుకున్నా.. కానీ

**బెల్జియం ప్రధాని**

**సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత పర్యటనకు విచ్చేసిన బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ ప్రధాని నరేంద్ర మోదీకి ఓ అరుదైన కానుక ఇవ్వాలనుకున్నారు. బెల్జియంలోని అత్యుత్తమ చాక్లెట్‌తో ప్రత్యేకంగా రూపొందించిన ఇండియా గేట్ ప్రతిరూపాన్ని బహుమతిగా తీసుకొచ్చారు. అయితే, భారత్‌కు చేరుకునేలోపే అనుకోని ఇబ్బంది ఎదురవ్వడంతో.. ప్రయాణ సమయంలోనే ఆ సున్నితమైన చాక్లెట్ శిల్పం కరిగిపోయింది. దీంతో ఈ అపురూప కానుకను ఆయన మోదీకి అందించలేకపోయారు. ఎంతో ప్రత్యేకంగా సిద్ధం చేసిన కానుక ఇలా మార్గమధ్యంలోనే పాడైపోవడంతో ఆయన నిరాశ చెందారు. మరో ప్రతిరూపం బెల్జియంలో సిద్ధంగా ఉందని.. ఎలాగైనా దాన్ని మోదీకి సురక్షితంగా అందిస్తానని చెప్పారు. చాక్లెట్లు దౌత్య సంబంధాలకు చాలా మంచివి కానీ, దౌత్య ప్రయాణాలకు మాత్రం అంత మంచివి కాదని అర్థమైందని వెవర్ సరదాగా చమత్కరించారు. మొదటి ప్రపంచ యుద్ధంలో బెల్జియం తరఫున పోరాడిన భారత సైనికుల వీరత్వం, త్యాగాలను స్మరించుకునేలా ఈ చాక్లెట్ రూపొందించారు. ఇరు దేశాల మధ్య ఉన్న చారిత్రక అనుబంధానికి ప్రతీకగా దీన్ని మోదీకి అందించాలని వెవర్ ఆశించారు.

### కొండా సురేఖ బర్తరఫ్

# ఆమె స్వయంకృతాపరాధం : ఆది శ్రీనివాస్



**సెప్టెంబర్ 03, విశ్వం వాయిస్ న్యూస్ :** మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించడం పూర్తిగా ఆమె స్వయంకృతాపరాధమేనని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వం సురేఖకు ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ, వాటిని ఆమె సద్వినియోగం చేసుకోలేకపోయారని విమర్శించారు. సొంత కుటుంబ సభ్యులను అదుపులో ఉంచుకోవడంలో సురేఖ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ, ఆమె కుటుంబ సభ్యులు పదేపదే తీవ్రస్థాయిలో బహిరంగ విమర్శలు చేస్తూ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరించారని ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సమయంలోనూ వారిని వారించకపోవడం సురేఖ వైఫల్యానికి నిదర్శనమన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్‌లతో కూడిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం పరిస్థితిని సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ కఠిన నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. అధిష్ఠానాన్ని సీఎం బ్లాక్‌మెయిల్ చేశారంటూ సురేఖ చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. అలాగే, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించబడిన సీనియర్ నేత జి. చిన్నారెడ్డి అంశాన్ని కూడా ఈ సందర్భంగా విప్ ప్రస్తావించారు. చిన్నారెడ్డి అంటే సీఎం రేవంత్ రెడ్డికి ఎంతో గౌరవమని, గతంలో ఆయన గెలుపు కోసం రేవంత్ రెడ్డి శ్రమించారని గుర్తుచేశారు. అయితే ఎంతటి సీనియర్ నాయకులైనా సరే... పార్టీని, ప్రభుత్వాన్ని బలహీనపరిచేలా ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదని పార్టీ అధిష్ఠానం తేల్చిచెప్పినందుకే ఈ కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చిందని ఆది శ్రీనివాస్ తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## చెప్పకుండానే చెక్‌పెడుతున్న సేనాని..!

ఇక, ఇప్పుడు ఆ స్థానంలో -జైకొట్టు- పేరుతో యువసేనకు శ్రీకారం చుట్టారు. ఇది అంత చిన్న విషయం కాదు.. చాలా వ్యూహాత్మకంగానే జనసేన పార్టీ అడుగులు వేసింది.

జనసేన పార్టీలో కొందరు సీనియర్లు.. కులాల ప్రాతిపదికన చేస్తున్న రాజకీయం తరచుగా పార్టీలో చర్చకు వస్తోంది. దీని వల్ల పార్టీ ఇమేజ్ దెబ్బతింటోందని అధినేత పవన్ కల్యాణ్ చెబుతున్నారు. అయినా కొందరు ఆ దిశగా ఆలోచన చేయలేకపోతున్నారు. మరికొన్ని చోట్ల కూటమి నాయకుల మధ్య వివాదాలు నివురు గప్పిన నిప్పులా మారుతున్నాయి. ఈ పరిణామాలు కూడా పార్టీని వేధిస్తున్నాయి. అందుకే.. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కీలక పదవులను సస్పెండ్ చేశారు.

ఇక, ఇప్పుడు ఆ స్థానంలో -జైకొట్టు- పేరుతో యువసేనకు శ్రీకారం చుట్టారు. ఇది అంత చిన్న విషయం కాదు.. చాలా వ్యూహాత్మకంగానే జనసేన పార్టీ అడుగులు వేసింది. సీనియర్లకు చెక్ పెట్టడంతో పాటు.. పార్టీ లైన్ తప్పిన వారికి కూడా జైకొట్టు ఒక కీలక హెచ్చరికగా మారనుంది. ఎన్నికలకు మూడు ఏళ్ల ముందే ఈ విభాగాన్ని ఏర్పాటు చేయడం వెనుక ఉద్దేశాలు కూడా.. సీనియర్లకు మింగుడు పడని విధంగా ఉన్నాయి. పార్టీని అతిక్రమించిన వారు.. కూటమి లక్ష్యాలను దెబ్బతీసేవారని పక్కన పెట్టే వ్యూహం దీనివెనుక ఉందన్న చర్చ సాగుతోంది.

నిజానికి.. జైకొట్టు విభాగం అంటే.. కేవలం యూత్‌ను ఆకర్షించడమని అందరూ అనుకున్నారు. కానీ, పార్టీ లక్ష్యాలకు భిన్నంగా వ్యవహరించే నాయకులకు కూడా ఇది చెక్ కానుంది. ఉదాహరణకు ఏదైనా నియోజ కవర్గంలో సీనియర్ నేత మాట వినకపోయినా.. ప్రస్తుతం సహిస్తారు. జనసేన అధినేత మాటలో చెప్పాలం టే భరిస్తారు. కానీ, ఎన్నికలంటూ వచ్చాక.. ఆ స్థానంలో అదే నియోజకవర్గం నుంచి యువ నేతను ఎంపిక చేసే అవకాశం ఉంటుంది. తద్వారా చెప్పకుండానే.. సీనియర్లకు మంగళం పాడేస్తారు.

అది ఒకరకంగా జెన్‌జీని ఆకర్షించడంతోపాటు.. సీనియర్లకు హెచ్చరికగా కూడా పనిచేయనుంది. నాయ కులు అంటే.. కేవలం ఆధిపత్యం కోసమో.. అధికారం కోసమో.. కాదన్న తరహాలోనే జనసేన రాజకీయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదిశగానే ఆలోచన చేస్తున్నారు. జైకొట్టు ద్వారా బలమైన యువతను ఆకర్షించి.. వారిని నాయకులుగా తీర్చిదిద్ది.. కూటమికి లైన్ క్లియర్ చేసే వ్యూహాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. తద్వారా.. నాయకులు ఎత్తుతున్న కుల రాజకీయాలు.. కూటమి విభేదాలకు జై కొట్టు చెక్ పెడుతుందని అంటున్నారు. సో.. ఇప్పుడు తేల్చుకోవాల్సింది.. వివాదాస్పద నాయకులు.. దారితప్పుతున్న ఎమ్మెల్యేలే!!.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ అరెస్ట్.. ఆస్తులు చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే



**సూర్యాపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సూర్యాపేట టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సోమయ్యను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయన ఇళ్లలో గురువారం సోదాలు చేపట్టారు. సోమయ్య కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులకు చెందిన 7 ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో భారీగా ఆస్తుల డాక్యుమెంట్లు, నగదు, బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నారు. సోమయ్యకు చెందిన 3 ఎకరాల 3 గుంటల వ్యవసాయ భూమి, సూర్యాపేట, హయత్‌నగర్ పరిధిలో 5 రెసిడెన్షియల్ ప్రాపర్టీలను గుర్తించారు. వీటిలో జీం1, జీం2, జీం4ంపెంట్‌హౌస్ భవనాలతో పాటు రెండు గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లు ఉన్నాయి. 8 ఓపెన్ ప్లాట్లు, రూ.4.63 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో రూ.13 లక్షల బ్యాలెన్స్, 709 గ్రాముల బంగారం, 1,750 గ్రాముల వెండి, రెండు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలు, ఇంట్లో రూ.11 లక్షల విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాంకులో 66 తులాల బంగారం తాకట్టు పెట్టి రూ.49 లక్షల గోల్డ్ లోన్ ఉన్నట్లు గుర్తించారు. ఏసీబీ లెక్కల ప్రకారం మొత్తం ఆస్తుల విలువ రూ.3,54,36,490 అని తేల్చారు. బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ భారీగా ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. సోమయ్య ఆస్తులపై ఏసీబీ మరింత లోతుగా విచారణ కొనసాగిస్తోంది. నిందితుడిని హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

## గంజాయి డాన్ నీతూబాయి నివాసంలో ఈడీ సోదాలు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** గంజాయి డాన్ నీతూబాయికి సంబంధించిన నివాసాల్లో ఈడీ అధికారులు సోదాలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 8చోట్ల ఈ సోదాలు జరుగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ సోదాలు చేపట్టింది. ఇప్పటికే నీతూబాయి గంజాయి అమ్మకాలతో రూ.కోట్లు సంపాదించింది. ఆ డబ్బును హవాలా మార్గంలో తరలించినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. నీతూబాయికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, ఆస్తులపై అధికారులు దృష్టి సారించారు. సోదాల్లో కీలక పత్రాలు, నగదు లావాదేవీలు, ఆస్తులకు సంబంధించి కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. సోదాలు పూర్తయిన తర్వాత ఈడీ అధికారులు పూర్తి వివరాలు వెల్లడించే అవకాశముంది.

## అక్కకు ఆస్తి రాదని.. బావను చంపేశాడు

**గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అక్కకు ఆస్తి దక్కదని భావించిన ఓ వ్యక్తి బావను సుపారీ గ్యాంగ్‌తో అపహరించి హత్య చేయించాడు. ఈ ఘటన గుంటూరు జిల్లా తెనాలిలో చోటుచేసుకుంది. ఈ హత్యకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు. ఇటీవల తెనాలిలో వ్యాపారి కోటి వీర నాగయ్య అదృశ్యం అయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో విచారణ చేపట్టగా హత్య విషయం వెలుగులోకి వచ్చింది. కోటి వీర నాగయ్య మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. దీంతో ఆస్తి తన అక్క, వారి పిల్లలకు దక్కకుండా పోతుందని భావించిన బావమరిది రాజేశ్ ఆయన హత్యకు కుట్ర పన్నాడు. ఇందుకోసం రూ.4 లక్షలతో సుపారీ గ్యాంగ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో నాగయ్యను సోమసుందరపాలెం వద్ద కిడ్నాప్ చేసి.. ఆపై హత్య చేయించాడు. అనంతరం మృతుడి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను నిందితులు దోచుకెళ్లారు. ఈ ఘటనకు సంబంధించి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. 32 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

## ఆటోను ఢీకొట్టిన బైక్.. ముగ్గురి మృతి

**తాళ్లరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. తాళ్లరేవు మండలం కొత్తూరు వద్ద ఆటోను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు మృతిచెందారు. ఘటనాస్థలంలో ఇద్దరు.. కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు చనిపోయారు. మృతులను కృష్ణ, కొండ్రు తంబి, మణికంఠగా గుర్తించారు. కోరంగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నకిలీ పాన్‌మసాలా, గుట్కా తయారీ కేంద్రం పట్టివేత

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** అక్రమ పాన్‌మసాలా, గుట్కా తయారీ, నిల్వ, విక్రయాలపై వాణిజ్య పన్నులశాఖ కొరడా ఝళిపించింది. పక్కా సమాచారంతో నగరంలోని 25 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించింది. బార్కాస్ సమీపంలోని ఎర్రగుంట వద్ద ఓ నివాస భవనంలో అక్రమంగా నిర్వహిస్తున్న పాన్‌మసాలా, గుట్కా తయారీ కేంద్రాన్ని అధికారులు గుర్తించారు. భారీగా ముడిపదార్థాలు, రసాయనాలు, తయారీకి ఉపయోగించే సామగ్రిని పట్టుకున్నారు. ఆర్ఎండీ, గోవా-100, బాద్‌షా, జాఫ్రానీ గోల్డ్, విమల్ పాన్‌మసాలాబ్రాండ్ల పేర్లతో ఉన్న ప్యాకింగ్ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకొని, సీజ్ చేశామని తెలిపారు.



# విశ్వం వాయిస్

అవినీతిపై - అక్షర సమరం...

VISWAMVOICE TELUGU DAILY

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు




శుక్రవారం, 04 సెప్టెంబర్, 2026

www.viswamvoice.com

సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత

www.viswamvoice.com







## ప్రముఖ డాక్టర్ల మధ్య

# చైర్మన్ పోరా...??

### మండపేట పురవార్డుల్లో జోరుగా సాగుతున్న గుసగుసలు....

**మండపేట టౌన్, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో మున్సిపాలిటీ లు ఒక లెక్క అయితే మండపేట మున్సిపాలిటీ మరో లెక్క అనేదానికి నిదర్శనంగా ఉంది మారబోతున్న ఈ పరిణామాలు. మున్సిపాలిటీ ఎన్నికలకు సమయం ఆసన్నమవడంతో ప్రధాన పార్టీలు సమర శంఖారావాలు మోగిస్తూ అభ్యర్థుల వెతుకులాటలో నిమగ్నమయ్యాయి. మండపేట పురపాలక సంఘం 30 నుండి 36 వార్డులకు పెరగడంతో ఆశావాహులు జోరుగా పార్టీ కార్యాలయాల చుట్టూ తమ మద్దతును తెలుపుతూ అధినేతల వద్ద మెప్పుకోసం తిరుగుతున్నారు. ఇది ఇలా ఉండగా ఈ సారి చైర్మన్ పోరు వైద్యం అందించే ఇద్దరు ప్రముఖ వైద్యుల మధ్య సాగనున్నదని కొత్తగా ఏర్పడిన 36 వార్డులలోని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఎన్నికలకు కావలసిన సామాగ్రిని సిద్ధం చేసుకోవాలని ఉన్నతాధికారులు నుంచి వస్తున్న సమాచారంతో ఓటరు జాబితాను సిద్ధం చేసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందించే పనిలో పడ్డారు మున్సిపల్ ఎన్నికల విభాగ అధికారులు. మున్సిపాలిటీల చైర్మన్ ల పదవీకాలం ముగిసి ఆరు మాసాలు అయిపోయింది. వైద్య వృత్తిలో అర్హత పొందిన జూనియర్ డాక్టర్ కన్నా సీనియర్ రోగి కే మందులపై ఎక్కువ అవగాహన ఉంటుందనట్లు రాబోయే రోజుల్లో జరగబోయే మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్ లను కూడా అంచనాలు వేసేస్తున్నారు మండపేట పురప్రజలు. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా తమ అభిమాన డాక్టర్‌ని నాయకుడిగా చేసుకుందామా అని ఆతృతగా ఎదురుచూస్తూ ఆసక్తిని కనబరుస్తున్నట్లుగా తెలుస్తుంది. ఎన్నికల కమిషన్ రిజర్వేషన్ల జాబితా విడుదల చేసేంత వరకు ఈ సందిగ్ధత వీడదు.

## అంబరాన్నంటిన నల్లా పవన్ కుమార్ జన్మదిన వేడుకలు

**అమలాపురం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ జన్మదిన వేడుకలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు ప్రాంతాల్లో అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించి నల్లా పవన్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నల్లా పవన్ కుమార్ ముందుగా అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బి.దొడ్డ వరంలో అభిమాని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అప్పనపల్లిలో ఏర్పాటు చేసిన మరో కార్యక్రమంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. తదుపరి అంబాజీపేటలో బీజేపీ మండల అధ్యక్షుడు కురస ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ చేతుల మీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నల్లా పవన్ కుమార్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం అమలాపురంలోని నల్లా పవన్ కుమార్ నివాసం వద్దకు పెద్ద సంఖ్యలో



అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు చేరుకుని ఘన స్వాగతం పలికారు. గజమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద వేడుకలు నిర్వహించారు. భారీ బాణాసంచా కాల్పుల నడుమ భారీ కేక్‌ను కట్ చేయగా అభిమానులు ఆనందోత్సాహాలతో సంబరాలు చేసుకున్నారు. ఈ జన్మదిన వేడుకల్లో రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీ గంటి హరీష్ మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, జనసేన పార్టీ నాయకులు, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, చిర్ల జగదీశ్వరి, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు నల్లా పవన్ కుమార్‌ను ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జన్మదిన వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని నాయకులు సందర్శించి, అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ, పేదలకు దుప్పట్ల పంపిణీ, వైద్య శిబిరం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

## ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలి : కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో భక్తుల భద్రతకు విఘాతం కలిగించే ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను పూర్తిగా నిర్మూలించాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. గురువారం ఉదయం నగరపాలక అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి.. దోబీ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమీ ఘాట్ సహా పలు ప్రాంతాలను సందర్శించారు. వారం రోజుల్లోగా దోబీ ఘాట్ నుంచి సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్ సహా మహాకాళేశ్వర టెంపుల్ వరకు ఉన్న ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా సూచించారు. పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి సురక్షితమైన రాకపోకలు కల్పించడంతో పాటు క్రౌడ్ మేనేజ్‌మెంట్ కు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. భక్తులకు సురక్షిత వాతావరణాన్ని కల్పించటం, రవాణా, సౌకర్యార్థం ఘాట్ల వెంబడి ఉన్న అనధికారిక కట్టడాలు, దుకాణాలను పూర్తిగా తొలగించాలన్నారు. పుష్కరాల సమయంలో నదీ స్నానాలు చేసే భక్తుల భద్రత అత్యంత ముఖ్యమని.. ఇందులో భాగంగా నదీ పరీవాహక ప్రాంతాలను రక్షించడం, తీరం వెంబడి ఉన్న ఆటంకాలను తొలగించడం అత్యవసరమని పేర్కొన్నారు. అలాగే



నగరంలో భక్తుల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రోడ్లు, ఫుట్ పాత్ లపై ఉన్న ఆక్రమణలను తొలగించాలన్నారు. ప్రధాన డ్రైనేజీ నెట్‌వర్క్, మైనర్ కాలువలపై వెలిసిన కమర్షియల్ షాపులు, ఆక్రమణలను గుర్తించి తక్షణమే తొలగించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. రహదారులపై ట్రాఫిక్ అంతరాయాలు తగ్గించటం, డ్రెయిన్ లలో నీటి ప్రవాహాన్ని మెరుగుపరచటం, ప్రభుత్వ స్థలాలను పరిరక్షించటం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా తెలియజేశారు. ఆయన వెంట స్పెషల్ ఆఫీసర్ మహేష్, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఈఈ మాధవి, ఎంహెచ్ఓ వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## 8న మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళా : శిరీష

**రాజమహేంద్రవరం, నేటివార్త :** తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గంలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో సెప్టెంబర్ 8వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ ఆపిల్ బ్రాడ్‌బ్యాండ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, టీమ్‌లీస్, సాయి మోటార్స్ ప్లాజా తదితర సంస్థల్లో పలు ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు.

**అభ్యర్థుల అర్హతలు:** వయస్సు: 19 నుంచి 35 సంవత్సరాల లోపు,

**విద్యార్హత:** పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా లేదా ఏదైనా డిగ్రీ.,ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారు.సంబంధిత రంగంలో అనుభవం ఉన్నవారు లేదా ఉద్యోగం పట్ల ఆసక్తి ఉన్నవారు,వివిధ సంస్థల్లో అందుబాటులో ఉన్న పోస్టులకు ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది.ఆసక్తి గల అభ్యర్థులు employment.ap.gov.in వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో ముందుగా రిజిస్టర్ చేసుకుని, రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు నేరుగా హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9398318601 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష కోరారు.






## 6,31 డివిజన్‌లలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు

### 200 మంది వృద్ధులకు చీరలు పంపిణీ

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం 6, 31వ డివిజన్లలో నాగేంద్ర లైఫ్ కనెక్ట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పవన్ కళ్యాణ్ జన్మదినం అంటే కేవలం వేడుక కాదు... ఒక సేవా స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా వృద్ధుల ముఖాల్లో చిరునవ్వు చూడాలని ఉద్దేశంతో 200 మందికి చీరలు పంపిణీ చేశారు. పవన్ కళ్యాణ్ తో పాటు జన సైనికులకు వృద్ధుల ఆశీర్వాదం అందించాలని కోరారు. 31వ డివిజన్ నుండి మహేష్, కబడ్డీ దుర్గ, ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు, 6వ డివిజన్ నుండి విష్ణు, ఫణి, ప్రకాష్, భార్గవ్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పవన్ కళ్యాణ్ చూపించిన మార్గం ఒక్కటేనని ప్రజల కోసం నిలబడాలి... బలహీనుల కోసం పోరాడాలి... అవసరంలో ఉన్నవారికి అండగా ఉండాలని కోరారు. అందుకే





మా జన్మదిన వేడుకలు పూలమాలలు, కేకులతో మాత్రమే కాదు... ప్రజల కళ్లలో ఆనందం కనిపించేలా సేవతో జరుపుకుంటున్నామని తెలిపారు. ఇదేవిధంగా ప్రజల కోసం పనిచేస్తూ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు.




### యువత ఓటు హక్కును

# వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్** : యువతకు ఓటు హక్కు అత్యంత కీలకమని, కళాశాలల్లో ఓటు హక్కు వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా మెజిస్ట్రేట్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వివేక్ యాదవ్, ప్రధాన ఎన్నికల అధికారి ఢిల్లీ రావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై సమీక్షించారు. ఓటర్ల నమోదు, మార్పులు––చేర్పులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలపై జిల్లాలో జరుగుతున్న ప్రక్రియను జిల్లా కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సుమారు 15 వేల క్లెయిమ్‌ల విచారణను సెప్టెంబర్ 20 నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో పెండింగ్‌లో ఉన్న విచారణలను రీ–షెడ్యూల్ చేసి నిర్ణీత గడువులోగా పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఫైనల్ డ్రాఫ్ట్‌లో పెండింగ్‌లో ఉన్న సుమారు 480 మంది పార్కింగ్ ఓటర్ల పరిశీలనను రానున్న మూడు రోజుల్లో ఈఆర్‌ఓల ద్వారా పూర్తి చేయించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఫారమ్–6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఫారమ్–7 ద్వారా తొలగింపులు, ఫారమ్–8 ద్వారా ఓటర్ల వివరాల్లో సవరణల ప్రక్రియ లక్ష్యాలకు అనుగుణంగా కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎన్‌జీఎస్‌పీ పోర్టల్‌లో నమోదయ్యే ఫిర్యాదులు, సమస్యలను నిరంతరం పర్యవేక్షిస్తూ సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి, ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తుది జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ధిక్కార ఖడ్గకవి పినిపేకు గౌరవ డాక్టరేట్

## నలభై ఏళ్ల సాహితీ సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక పురస్కారం - సమసమాజ స్థాపనకు మరింత అంకితభావంతో కృషి చేస్తానన్న ఖడ్గకవి



**అమలాపురం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** సామాజిక అసమానతలు, వివక్ష, అన్యాయాలపై తన కవిత్వంతో నిరంతరం ప్రశ్నిస్తూ ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్న ప్రముఖ సాహితీవేత్త, 'ధిక్కార ఖడ్గకవి' పినిపే సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్ లభించింది. ఆయన నాలుగు దశాబ్దాల సాహితీ సేవలను గుర్తించిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ గౌరవాన్ని ప్రదానం చేశారు. తెలంగాణ సారస్వత పరిషత్, బొగ్గులకుంటలోని డాక్టర్ సి.నారాయణరెడ్డి ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను పినిపే సత్యనారాయణకు ప్రదానం చేశారు. స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకులు ఆకుల రమేష్, గూడూరి చెన్నారెడ్డి, ఆంధ్రప్రభ జనరల్ మేనేజర్ పసుపులేటి రమేష్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పినిపే సత్యనారాయణ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో జన్మించి, తొండవరం ఉన్నత పాఠశాలలో భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్న తన సాహితీ ప్రతిభను గుర్తించి, ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా గౌరవ డాక్టరేట్ అందించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న తన సాహితీ తృష్ణకు ఈ గౌరవం మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందని పినిపే పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత అంకితభావంతో సమసమాజ స్థాపన కోసం తన కవిత్వాన్ని కొనసాగిస్తానన్నారు. అణగారిన వర్గాల గొంతుకగా, సామాజిక అసమానతలను ప్రశ్నించే సాహిత్యాన్ని మరింత విస్తృతంగా సృష్టించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన రచనల్లో సామాజిక చైతన్యం, సమానత్వం, మానవతా విలువలకు ప్రాధాన్యం ఇస్తున్న పినిపే సత్యనారాయణ త్వరలో 'అఖండ ఖడ్గ కంఠం', 'నిషిద్ధ వర్ణ కాండ' తదితర పుస్తకాలను పాఠకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలిపారు. గౌరవ డాక్టరేట్ ప్రదానోత్సవంలో ప్రొఫెసర్ కుంట సురేష్, ఆకుల మంజుల, గూడూరి చెన్నారెడ్డి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ మంగం సత్యనారాయణ, ప్రముఖ వ్యాపారవేత్త నల్లా చిరంజీవి, డాక్టర్ పి.జి. సుదర్శన్, పినిపే సతీష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, ప్రముఖులు పినిపే సత్యనారాయణను అభినందించారు. తొండవరం హైస్కూల్ హెచ్‌ఎం బి. కేశవాచార్యులు, తోటి ఉపాధ్యాయులు, ఆత్మీయులు, అభిమానులు ప్రత్యేకంగా అభినందించినట్లు పినిపే సత్యనారాయణ తెలిపారు.

# రామచంద్రాపురం మండలంలో తంగేటి యల్లారావు హత్య కేసు

## : రెండవ నిందితుడి నుండి నాల్గవ నిందితుడి వరకు ముగ్గురి అరెస్టు



**రామచంద్రపురం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్** : రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆగస్టు 24, 2026న జరిగిన తంగేటి యల్లారావు హత్య కేసులో దర్యాప్తు కొనసాగుతుండగా, ఈ కేసులో రెండు నుండి నాల్గవ నిందితుల వరకు గల ముగ్గురిని పోలీసులు సెప్టెంబర్ 2, 2026న అరెస్టు చేశారు. ఈ కేసులో అరెస్టయిన నిందితులు రేవు పవన్ కళ్యాణ్ (రెండవ నిందితుడు), రేవు వీరబాబు (మూడవ నిందితుడు), మరియు కొమరపు తరుణ్ కుమార్ (నాల్గవ నిందితుడు)లుగా గుర్తించారు. విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, ప్రధాన నిందితురాలైన ఉమాదేవితో పవన్ కళ్యాణ్‌కు గత రెండు సంవత్సరాలుగా పరిచయం ఉంది. ఈ విషయం తెలిసి మృతుడు యల్లారావు ఆమెను వేధిస్తుండటంతో, సుమారు నాలుగు నెలల క్రితం ఉమాదేవి కోరిక మేరకు పవన్ కళ్యాణ్ తన తమ్ముడు వీరబాబు మరియు బావమరిది తరుణ్ కుమార్‌లను ఆమె ఇంటికి పంపి యల్లారావును కొట్టించి హెచ్చరించాడు. అయినప్పటికీ వేధింపులు తగ్గకపోవడంతో, ఆగస్టు 24న ఉమాదేవి మరియు పవన్ కళ్యాణ్ ఫోన్ ద్వారా మాట్లాడుకుని హత్యకు పథకం పన్నారు. ఆ పథకం ప్రకారం అదే రోజు రాత్రి పవన్ కళ్యాణ్ తన ద్విచక్ర వాహనంపై వీరబాబు, తరుణ్ కుమార్‌లను వెంటబెట్టుకుని మృతుడి నివాసం వద్దకు వెళ్లాడు. పవన్ కళ్యాణ్ కొద్ది దూరంలో కాపలాగా ఉండగా, వీరబాబు మరియు తరుణ్ కుమార్‌లు లోపలికి వెళ్లి అప్పటికే భర్తతో గొడవపడుతూ సిద్ధంగా ఉన్న ఉమాదేవితో కలిసి యల్లారావును కింద బోర్లా పడవేశారు. ఆ సమయంలో వీరబాబు చేతులను, తరుణ్ కుమార్ కాళ్లను గట్టిగా పట్టుకోగా, ఉమాదేవి మంచం కింద ఉన్న రాయితో యల్లారావు వీపు, చేతుల మీద విచక్షణారహితంగా కొట్టింది. అదే రాయితో వీరబాబు మరియు తరుణ్ కుమార్ కూడా మృతుని వీపుపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలపాలైన యల్లారావు స్పృహ కోల్పోయి పడిపోయాడు. అనంతరం అతన్ని మంచంపై పడుకోబెట్టి నిందితులు అక్కడి నుండి వెళ్లిపోయారు, ఆ తర్వాత యల్లారావు మృతి చెందాడు. నేరం జరిగిన తర్వాత పోలీసులకు చిక్కకుండా నిందితులు పరస్పరం సంప్రదించుకుంటూ జాగ్రత్తలు తీసుకున్నారు. ఒకవేళ పోలీసులు అరెస్టు చేస్తే తానే బెయిల్ ఏర్పాటు చేస్తానని, తన తమ్ముడు మరియు బావమరిది పేర్లు ఎవరికీ చెప్పవద్దని పవన్ కళ్యాణ్ ఉమాదేవికి సూచించడంతో, ఆమె నేరాన్ని తన బంధువుల ముందు ఒప్పుకుంది. అయితే పోలీసులు సీసీటీవీ దృశ్యాలు, ఫోన్ కాల్ వివరాలు మరియు ఇతర ఆధారాలను సేకరించి నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. అరెస్టయిన నిందితులను గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరిచి రిమాండుకు తరలించనున్నారు. ఈ కేసుకు సంబంధించి తదుపరి దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది.

### నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**అమలాపురం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఎర్ర వంతెన సమీపంలోని బండారు గార్డెన్స్‌లో ఉన్న నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని విద్యార్థినీ, విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో పాఠశాలకు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల వేషధారణలు, సందడితో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. సాయంత్రం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బి.మహేష్ మాట్లాడుతూ శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధనలు, మహాభారతంలో చోటుచేసుకున్న ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు వివరించారు. శ్రీకృష్ణుడి జీవితం నుంచి ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను విద్యార్థులు అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏఓ రాజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# భాష్యం స్కూల్లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**అమలాపురం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్** : అమలాపురంలోని భాష్యం స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం చిన్నారుల కృష్ణ, రాధ వేషధారణలతో సందడిగా మారింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో ముస్తాబై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు శ్రీకృష్ణుని జీవిత విశేషాలు, బాల్య ఘట్టాలు, గోపికల నృత్యాలు, పాటలు, నృత్య ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారుల చక్కటి ప్రదర్శనలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి భాష్యం స్కూల్ జోనల్ ఇన్‌చార్జ్ జవ్వాది వెంకట శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, ప్రిన్సిపల్ సిహెచ్. రవి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ విశిష్టతను వివరించారు. శ్రీకృష్ణుడి జీవితం, ఆయన బోధనలు, ధర్మం, సత్యం, కర్తవ్యనిష్ఠ, మానవతా విలువల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో నిర్వహించిన నృత్యాలు, పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా చిన్నారులు ధరించిన శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమాలను తల్లిదండ్రులు ఆసక్తిగా తిలకించి చిన్నారులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా వారిలో నైతిక విలువలు, సాంస్కృతిక చైతన్యం పెంపొందించవచ్చని పేర్కొన్నారు. పండుగల సందర్భంగా నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. వేడుకల్లో చాంప్స్ ఇన్‌చార్జీలు కె.నాగశ్రీ, కె.రాజేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిశాయి.

### ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్కూల్‌లో

# ఆకట్టుకున్న ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**రామచంద్రపురం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురం పట్టణం ముచ్చుమిల్లిలో ఉన్న ఏబీసీ మోడరన్ ప్రైమరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు గురువారం ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అకాడమిక్ డైరెక్టర్ ఎ. రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులు చిన్ని కృష్ణ,గోపికల వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుని కీర్తిస్తూ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు హైలెట్ గా నిలిచాయి. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు మాట్లాడుతూ శ్రీకృష్ణతత్వం విశ్వవ్యాప్తమైనదని, శ్రీకృష్ణ భగవానుడు ప్రపంచానికి అందజేసిన అత్యుత్తమ ఆధ్యాత్మిక గ్రంథం భగవద్గీత అని కొనియాడారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ శ్రీనివాసరావు చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అకాడమిక్ డైరెక్టర్ రమాదేవి మాట్లాడుతూ భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలను, పండుగలను విద్యార్థి దశ నుంచే పరిచయం చేయాలనే సత్సంకల్పంతో ప్రతి పండుగను వినూత్నంగా తమ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్ముని బోధనలకు విదేశీయులు సైతం స్ఫూర్తి పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాన్స్ మాస్టారు చెవ్వూరి తులసీరామ్, ఏబిసి ప్రైమరీ స్టాఫ్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ
జిల్లా ఎడిషన్

శుక్రవారం, 04 సెప్టెంబర్ 2026
www.viswamvoice.com



# జిమ్ ట్రైనర్ హత్య కేసులో నలుగురి అరెస్టు

## మార్ఫింగ్ ఫొటోలే హత్యకు కారణం - అదనపు ఎస్పీ కిషోర్‌కుమార్ వెల్లడి

**కాకినాడ, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ భానుగుడి సెంటర్‌లో జిమ్ ట్రైనర్ కొడమాటి సతీష్‌రెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ, కాకినాడ ఇన్‌చార్జి ఎస్‌డీపీవో డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ గురువారం తెలిపారు. కాకినాడ డివిజనల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

కాకినాడ లోని రామకృష్ణారావుపేటకు చెందిన సతీష్‌రెడ్డి ఆగస్టు 26 వ తేది న తెల్లవారు జామున 2 గంటల సమయంలో భానుగుడి సెంటర్ లోని చార్మినార్ టీ సెంటర్ వద్ద హత్యకు గురయ్యాడు. మృతుడి స్నేహితుడైన బొందల సాయి కిరణ్‌తో పాటు ఇంటి సత్యనారాయణ, ప్రయాగ దుర్గాప్రసాద్, ఇంటి ఆదికృష్ణ కలిసి సతీష్‌రెడ్డిపై దాడి చేసినట్లు దర్యాప్తులో తేలింది. మొదట కాళ్లతో తన్నడంతో పాటు చెక్కబద్దతో తల, ముఖం, శరీరంపై దాడి చేశారు. చెక్కబద్ద విరిగిపోవడంతో దాని పదునైన ముక్కతో సాయికిరణ్ సతీష్‌రెడ్డి గొంతులో పలుమార్లు పొడిచినట్లు పోలీసులు తెలిపారు.



**మార్ఫింగ్ ఫొటోలపై విభేదాలు**

ప్రధాన నిందితుడు సాయికిరణ్‌కు ప్రేమ వ్యవహారానికి సంబంధించి సతీష్‌రెడ్డితో విభేదాలు ఏర్పడ్డాయని పోలీసులు తెలిపారు. సాయికిరణ్ మరో యువతితో ఉన్నట్లుగా సతీష్‌రెడ్డి మార్ఫింగ్ చేసిన ఫొటోలను అతని ప్రియురాలికి పంపడంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు విచారణలో వెల్లడైందన్నారు. సతీష్‌రెడ్డి తనను చంపుతానని బెదిరించడంతో, అతను బతికి ఉంటే తనకు ప్రాణహాని ఉంటుందనే ఉద్దేశంతో హత్యకు పాల్పడినట్లు సాయికిరణ్ విచారణలో వెల్లడించినట్లు తెలిపారు.

**రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు**

మృతుడి అన్న కొడమాటి యర్రయ్యరెడ్డి ఫిర్యాదు మేరకు కాకినాడ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో క్రైం నంబర్ 135/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 103(1) రెడ్‌విత్ 3(5) ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితులు నేరం అనంతరం పరారయ్యారు. దుర్గాప్రసాద్ తన బుల్లెట్ మోటార్ సైకిల్ (ఏ పి 05 డిఎన్ 8800)ను కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో ఉంచి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్సైలు సువర్ణకుమారి, ఎల్ భీష్మకుమార్, పి సత్తిబాబు, పోలీసు, క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. విశ్వసనీయ సమాచారంతో రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద పోలీసులు మాటువేసి ఉండగా, బుధవారం సాయంత్రం బుల్లెట్‌ను తీసుకునేందుకు వచ్చిన నలుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బొందల సాయికిరణ్ (30), ఇంటి సత్యనారాయణ (30), ప్రయాగ దుర్గాప్రసాద్ (28), ఇంటి ఆదికృష్ణ (30) ఉన్నారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, బుల్లెట్ మోటార్‌సైకిల్, ఘటన సమయంలో ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు

# సిటీలో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేసిన ఎస్పీ





**కాకినాడ, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలో ఇటీవల చోటుచేసు కుంటున్న సంఘటనలు నేపథ్యంలో జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ నేరుగా రంగంలోకి దిగారు.బుధవారం అర్ధరాత్రి నగరంలోని భానుగుడి, అన్నమ్మ ఘాటీ, డైరీ ఫాం సెంటర్, సర్పవరం సెంటర్ తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి వాహనాల తనిఖీలు, గస్తీ విధులను పరిశీలించారు. నగరంలో నేరాలకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచుతూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, గస్తీ మరింత పెంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు తమ వైఖరిని మార్చుకోవాలని జిల్లా ఎస్పీ తీవ్రంగా హెచ్చరించారు. నేరాలకు పాల్పడే వారు, రౌడీ మూకలు మరియు అలవాటు పడిన నేరస్తులపై కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే వారి నేర చరిత్రను పరిగణనలోకి తీసుకుని పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు తరలిస్తామని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలిగించే ఎవరినీ ఉపేక్షించ బోమని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్పీ డీఎస్పీ కె.వి.వి.సత్యనారాయణ, పలువురు సిఐలు, ఎస్సైలు, పోలీసు సిబ్బంది జిల్లా ఎస్పీ వెంట ఉన్నారు.

# నిరాడంబరంగా యనమల రాజేష్ జన్మదిన వేడుకలు






**కోటనందూరు, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆడంబరాలకు ఆమడ దూరం.. అట్టహాసాలకు తావే లేదు. మంచికి మారుపేరు నీతి నిజాయితీలతో నిబద్ధత కలిగిన నేత యనమల రాజేష్ జన్మదిన వేడుకలు నిరాడంబరంగా జరిగాయి. పదిమందికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో యనమల రాజేష్ జన్మదిన వేడుకలు జరిగాయి. పలు గ్రామాల్లో టీడీపీ నేతలు హడావుడి చేయకుండా అభిమాన నేత యనమల రాజేష్ జన్మదిన వేడుకలను ప్రజాహిత కార్యక్రమాలతో జరిపారు. మొదటిగా యనమల రాజేష్ అన్నవరం శ్రీ సత్యదేవుని దర్శించుకుని వేద ఆశీర్వాదం తీసుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం బెండపూడిలోని విభిన్న ప్రతిభావంతులతో కాసేపు గడిపిన యనమల రాజేష్ సొంత నిధులతో భోజన ఏర్పాట్లు చేశారు. తుని ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ లో సీనియర్ నేత యనమల రాజేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్ అన్నవరం గ్రామ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు బోడాల జమీలు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వైద్యులతో కలిసి యనమల రాజేష్ ప్రారంభించారు. రక్తదానం చేసిన దాతలను యనమల రాజేష్ శాలువాతో సత్కరించి సర్టిఫికేట్లు ప్రధానం చేసారు. యువసారధి జన్మదినాన్ని పురస్కరించుకుని వసంత ఫౌండేషన్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# జిల్లాలో గురుపూజోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు

**జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్**



**కాకినాడ, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర వెలకట్టలేనిదని, భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో అహర్నిశలు శ్రమించే ఉపాధ్యాయులకు సముచిత గౌరవం అందించేలా ఈ నెల 5 వ తేది న కాకినాడ జిల్లాలో గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి పి.రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ రాష్ట్రపతి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5 వ తేది న కాకినాడ నగరంలోని జేఎన్టీయూ అలుమ్ని ఆడిటోరియంలో శనివారం ఉదయం 9:30 నిమిషాలకు ప్రారంభమవుతాయన్నారు. ఈ గురుపూజోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తో పాటు జిల్లాలోని గౌరవ ప్రజాప్రతినిధులు విశిష్ట అతిథులుగా పాల్గొంటారన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఈ వేదికపై ఘనంగా సత్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ వేడుకలకు జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రతినిధులు హాజరై, గురుపూజోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని ఆ ప్రకటనలో డీఈవో పి.రమేష్ కోరారు.

# పూల వ్యర్థాలతో మహిళలకు ఉపాధి

## 'టెంపుల్ ఎసెన్షియల్స్'ను రాజమహేంద్రవరం బ్రాండ్‌గా తీర్చిదిద్దాలి : ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

## 2027 పుష్కరాల నాటికి మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి - 35 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఐదు రోజుల శిక్షణ

**కడియం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళలు కేవలం ఆర్థిక సహాయం పొందే స్థాయికే పరి మితం కాకుండా స్వయం ప్రతిపత్తి కలిగిన పారిశ్రామికవేత్తలుగా ఎదిగినప్పుడే దేశ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవు తుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. మహిళా సాధికారతను దాటి 'మహిళా నేతృ త్వంలో అభివృద్ధి' దిశగా ముందుకు సాగాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆలోచనా విధానానికి అనుగు ణంగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కడియంలోని జీఎన్‌ఆర్ కల్యాణ కన్వెన్షన్ హాలులో ఎలీప్ (ఎఎల్ఈఎపి), జిల్లా యంత్రాం గం ఆధ్వర్యంలో, కన్నౌజ్‌కు చెందిన ఫ్రాగ్రెన్స్ అండ్ ఫ్లేవర్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఎస్.ఎఫ్.డి.సి), కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సాంకేతిక సహకారంతో నిర్వహిస్తున్న ఐదు రోజుల 'టెంపుల్ ఎసెన్షియల్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో మూడో రోజు శిక్షణ కార్యక్రమానికి గురువారం ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న 35 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వివిధ ఉత్పత్తులను ఎంపీ, కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర ప్రముఖులు పరిశీలించారు.ఈ సందర్భంగా




ఎంపీ దగ్గుబాటి పురం ధరేశ్వరి మాట్లాడుతూ స్వామి వివేకా నందుని ఆలోచనల నుంచి స్ఫూర్తి పొంది మహిళలను దేశ అభివృద్ధిలో భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు.రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లోని ఆలయాల నుంచి లభించే పూల వ్యర్థాలను వృథా చేయకుండా వాటితో అత్తర్లు, పర్ఫ్యూమ్స్, అగరబత్తీలు, ఇతర సుగంధ ఉత్పత్తులను తయారు చేయాలనే ఆలోచనతో 'టెంపుల్ ఎసెన్షియల్స్-రాజమహేంద్రవరం' ప్రాజెక్టును చేపట్టినట్లు ఎంపీ తెలిపారు. కన్నౌజ్‌కు చెందిన ఎస్.ఎఫ్.డి.సి నిపుణుల ద్వారా మహిళలకు అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నా మన్నారు. శిక్షణ ఇవ్వడంతో బాధ్యత ముగియదని, మహిళలు సొంతంగా పరిశ్రమలు స్థాపించే వరకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. శిక్షణ కేంద్రాలు, యంత్రాల ఏర్పాటుకు స్థలం, బ్యాంకు రుణాలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.2027 గోదావరి పుష్కరాల నాటికి మహిళలు తయారు చేసే టెంపుల్ ఎసెన్షియల్స్ ఉత్పత్తులను భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీ పిలుపునిచ్చారు.జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుని మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. పూలు, నూనెలు, తులసి, లెమన్‌గ్రాస్, రోజ్ తదితర సహజ వనరులతో అగరబత్తీలు, పర్ఫ్యూమ్స్, ఎసెన్షియల్ ఆయిల్స్ తదితర ఉత్పత్తుల తయారీపై మహిళలకు ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రూరల్ పరిధిలో 20 ఎకరాల్లో మహిళా పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తున్నామని, కలెక్టరేట్ సమీపంలోని ఎంఎస్ఎంఈ పార్కులోనూ మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.ఎస్.ఎఫ్.డి.సి. డైరెక్టర్ శక్తి వినయ్ శుక్లా ,ఎఎల్ఈఎపి అధ్యక్షురాలు కె. రమాదేవి,శిక్షణ పొందుతున్న కె. ప్రవల్లిక,శిక్షణ పొందుతున్న డ్వాక్రా సభ్యురాలు లక్ష్మి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఎంపీపీ ఎలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, ఎస్.ఎఫ్.డి.సి. డైరెక్టర్ శక్తి వినయ్ శుక్లా, ఎఎల్ఈఎపి అధ్యక్షురాలు కె. రమాదేవి శిక్షణ పొందుతున్న మహిళలు తయారు చేసిన వివిధ అగరబత్తీలు, అత్తర్లు, సుగంధ ఉత్పత్తులు తదితరాలను పరిశీలించి మహిళలను అభినందించారు.ఈ కార్యక్రమంలో తూర్పు గోదావరి జిల్లా సహాయ కలెక్టర్ కే. ఆదిత్య శర్మ, కాకినాడ జిల్లా సహాయ కలెక్టర్ ప్రియ, ఎంపీపీ ఎలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. నగేష్, డి ఆర్ డి ఏ అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఎలీప్ ప్రతినిధులు, ఎస్.ఎఫ్.డి.సి నిపుణులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ నుండి ఫార్మసీ వరకు ఔషధ మొక్కల ప్రాధాన్యతపై

# ఎపిఎస్ఎఫ్ఎలో అతిథి ఉపన్యాసం



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీ, రాజమహేంద్రవరంలో నేడు నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఏ.చంద్రశేఖర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్ ఔషధ మరియు సుగంధ మొక్కల బోర్డు, విజయవాడ, 'అటవీ నుండి ఫార్మసీ వరకు' అనే అంశంపై ఆయుర్వేద వైద్యంలో ఔషధ మొక్కల ప్రాముఖ్యతను వివరిస్తూ అతిథి ఉపన్యాసం ఇచ్చారు. సీఈఓ తన ప్రసంగంలో ఔషధ మొక్కల గుర్తింపు, వాటి సాగు పద్ధతులు, మార్కెటింగ్ అవకాశాలు తదితర అంశాలను వివరించారు. రైతులు ఔషధ మొక్కల సాగును ఒక వాణిజ్య వ్యాపార సంస్థగా చేపట్టి, పెద్ద ఎత్తున సాగు చేసే అవకాశం ఉందని కూడా ఆయన తెలియజేశారు.



# ఆయిల్ ఫామ్ రైతులకు గుదిబండగా మారిన ఎల్‌నినో ప్రభుత్వ నిర్లక్ష్యం



## అడ్డ కత్తెరలో పోకచక్కగా నూతన ఆయిల్ ఫామ్ రైతులు - డ్రిప్ కోసం ఎదురుచూపులు

**కోరుకొండ, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్ నీనో ప్రభావం రసాయనిక ఎరువులు నీటి యాజమాన్యం తక్కువ పెట్టుబడి వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ ఫామ్ సాగు చేయాలని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం ఊదరగొట్టడంతో సన్న చిన్నకారు రైతులు పెద్దఎత్తున ముందుకు వచ్చి ఆయిల్ ఫామ్ సాగుకు సంసిద్ధమయ్యారు. ఆయిల్ ఫామ్ సాగుపై ఎటువంటి అవగాహన లేకున్నా ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి, ముందుకు వచ్చిన రైతులకు డ్రిప్ ఇరిగేషన్ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తూ కాలం వెళ్ళదీస్తుందని, దీంతో ఆయిల్ ఫామ్ తోటలకు సక్రమమైన నీటి యాజమాన్యం లేకపోవడం, మరో పక్క తీవ్రమైన ఎల్ నీనో ప్రభావంతో నూతనంగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతులకు మానసిక ఆవేదంతో కంటిమీద కునుకు పడడం లేదు. ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు సకాలంలో విద్యుత్ సౌకర్యం, ఉచిత మొక్కల పంపిణీ, 90శాతం రాయితీపై డ్రిప్పు ఇరిగేషన్, మూడు ఏళ్ల పాటు రాయితీపై ఎరువులు, తక్కువ పెట్టు దీర్ఘకాలం పాటు అధిక ఆదాయం వంటి సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని పెద్ద ఎత్తున ప్రచారం ఊదర కొట్టడంతో చిన్న రైతులందరూ ముందుకు వచ్చారు. ప్రభుత్వం విద్యుత్ శాఖకు సకాలంలో విద్యుత్ పరికరాలు అందించకపోవడంతో విద్యుత్ కనెక్షన్ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఇక డ్రిప్పు విషయానికి వస్తే మూడు నెలలుగా ఆయిల్ ఫామ్ రైతులకు ఆన్లైన్ చేయకపోవడం, ఆన్లైన్ చేసుకున్న వారికి చాలా కంపెనీలు నేటికి డ్రిప్ సౌకర్యాలు కల్పించకపోవడంతో సరైన నీటి యాజమాన్యం లేక ఆయిల్ ఫామ్ మొక్కలు అటకెక్కుతున్నాయి. దీనికి తోడు మరో ప్రక్క అధిక ఉష్ణోగ్రతలు, కొమ్ము పురుగు మొక్కలను ఆశించి మొక్కలకు తీవ్ర నష్టం కలిగిస్తుంది. దీంతో ఆయిల్ ఫామ్ రైతుల పరిస్థితి అడ్డ కత్తిరిలో పోకచెక్క చందనం పరిస్థితిగా ఉందని చెప్పక తప్పదు. ఆయిల్ ఫామ్ సాగులో ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పడక ముందే విద్యుత్తు, డ్రిప్పు ఇరిగేషన్ వంటి సౌకర్యం వెంటనే కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# రైతులందరికీ ఆధునిక సాంకేతిక పాస్ పుస్తకాలు పంపిణీ

తాసిల్దార్ సునీత



**కోరుకొండ, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతులందరికీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎటువంటి అవకతవలకు ఆస్కారం లేకుండా ఉన్న పట్టాదార్ పాస్ పుస్తకాలను ప్రభుత్వం అందిస్తుందని తాసిల్దార్ సునీత అన్నారు. గురువారం కనుపూరులో మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా తాసిల్దార్ సునీత చేతుల మీదుగా రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ సునీత మాట్లాడుతూ కనుపూరు గ్రామానికి సంబంధించి మొత్తం విస్తీర్ణం 3,525 ఎకరాలు ఉందని, ప్రభుత్వభూమి చెరువులు, కుంటలకు సంబంధించి సుమారు 509 ఎకరాలు ఉందన్నారు. రైతుల ఖాతాలు1,670 కాగా1,643 రైతులకు క్యూఆర్ కోడ్, రాజముద్ర తో నకిలీకి ఆస్కారం లేకుండా పట్టాదారుపాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎల్పీలు వంటి సాంకేతిక కారణాలవల్ల 27 మంది రైతులకు పాస్ పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. కౌలుదారులు 371 మంది ఉన్నారన్నారు. ప్రతి రైతుకు రెవెన్యూసిబ్బంది తమ ఇంటికి వచ్చి తప్పనిసరిగా పాస్ పుస్తకాలు అందజేస్తారని, ఎవరు కంగారు పడొద్దు అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామిరెడ్డి, వీఆర్వోలు తామాడ సత్యనారాయణ, కర్రి రాజు, సూర్య అప్పారావు, వంగూరి శ్రీను, ఎన్డీఏ నాయకులు అన్నం చల్లారావు కరణం నరసింహమూర్తి, వెలిచేటి రాంబాబు, కరణం గంగన్న రైతులు పాల్గొన్నారు.

### సీసీ కెమెరాల ఏర్పాటుకు

# దాతలు ముందుకు రావాలి

ఎస్ఐ ఎల్.శ్రీను నాయక్



**సీతానగరం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మునికూడలి గ్రామంలో సీతానగరం ఎస్సై ఎల్.శ్రీను నాయక్ సూచన మేరకు సానిపిన్ని రామారావు దాతలతో మాట్లాడి గ్రామంలో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగింది. సీసీ కెమెరాలు నేర నివారణకు నేరస్తులను కనిపెట్టడంలోనూ ఎంతో ప్రముఖ పాత్ర వహిస్తాయి కాబట్టి సమాజ శ్రేయస్సు కొరకు నాయకులు గ్రామ పెద్దలు దాఖలు సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ తెలియజేశారు. మరియు గ్రామాలలో ఉన్న ప్రతి ఒక్క గుడికి సీసీ కెమెరాలు సదర్ కమిటీ వాళ్లు ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావాలని సీతానగరం ఎస్ఐఎల్ శ్రీను నాయక్ విజ్ఞప్తి చేశారు.

# ఎంపీఎస్‌లో ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు



**మండపేట మండలం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పబ్లిక్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజ్‌లో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు కృష్ణులు, గోపికల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. గోపికల వేషధారణలో విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన చూపరులను అలరించింది. పాఠశాల ఆవరణలో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు కేరింతలు కొడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు గాలిలో ఎగురుతూ ఉట్టి కొట్టి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అన్ని మతాల సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించడం ఎంతో ముఖ్యమని, భావితరాలకు పండుగలు, సంస్కృతి, సంప్రదాయాలను పరిచయం చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంపీఎస్ డైరెక్టర్ వల్లూరి చిన్నారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎస్ కాలేజ్ ప్రిన్సిపల్ దేవళ్ళ సాయి గంగాధర్ రావు, స్కూల్ ఏవోలు పుట్టా హేమాంబిక, మానేపల్లి కిరణ్మయి, దేవళ్ళ ప్రసన్న, తిరుశుల దత్తాత్రేయ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఎంపీపీ కార్యాలయము నందు ఎంపీపీ గుర్రాల జోత్స్న అధ్యక్షతన

# చివరి మండల సర్వసభ్య సమావేశం



**సీతానగరం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల ప్రజాపరి షత్ కార్యాలయం నందు ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన గురు వారం మండల సర్వసభ్య సమా వేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధి కార్య కలాపాలను సభ్యులకు వివరించా రు. రోడ్లు భవనాలశాఖల ద్వారా జరిగిన ప్రగతిని ఆ శాఖల అధికా రులు సుబ్రహ్మణ్యం,వీరబాబు సభ్యులకు వివరించారు. ఇటీవల కాలంలో రాపాక తూముల సమీ పంలో ఏర్పాటు చేసిన లేఅవుట్ పై తూరలు వేసి రోడ్డు మార్గాన్ని ఏర్పా టు చేయడంతో పలువురు పి జి ఆర్ ఎస్ లో సంబంధిత ఇరిగేషన్ అధికారిని ప్రశ్నించినా ఆ అధికారి కంప్లైంట్ దారుని అర్జీని పరిశీలిం చకుండానే క్లోజ్ చేయడంపై మండ ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేసిన సందర్భం ఈ సమావేశంలో ఏర్ప డింది. ఈ అధికారి లేఔట్ దారుని వద్దనుండి ముడుపులకు ఆశపడు తున్నారా అని అనుమానాలు మండల ప్రజల నుండి ఏర్పడు తున్నాయి. దాంతో సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఈ నేపథ్యంలోనే మండల ఎస్సై శ్రీను నాయక్ మాట్లాడుతూ నేరాలను అరికట్టేందుకు ప్రతి గ్రామంలోనూ గొప్పింటివారు అలాగే ప్రతి దేవాలయంలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నాన ని అన్నారు. రాబోయే గణపతి నవ రాత్రుల మహోత్సవానికి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రతి ఒక్క రూ అవాంఛనీయ సంఘటనలు ఏర్పడకుండా తప్పనిసరిగా అను మతులు పొందాలని కోరుతున్నా నని అన్నారు. ఈ సర్వసభ్య సమావేశం గత ప్రభుత్వంలో ప్రజలచే ఎన్నుకోబడి జడ్పిటిసి, ఎంపీపీ,ఎంపీటీసీలకు సెప్టెంబర్ 23వ తారీఖునకు పదవీకాలం ముగియనుండడంతో ఈ సర్వసభ్య సమావేశం నిర్వహించ బడింది సమావేశంలో ఎంపీడీవో భారతి ఎంపీటీసీలు కుమ్మిరిశెట్టి వెంకటే శ్వరరావు,ఉస్సే ఏసమ్మ,ముదు నూరిసుబ్బలక్ష్మి, తాడేపల్లి వెంక ట్రావు,మాకిరెడ్డి దేవి,సుంకవల్లి నారాయణ (సత్తిబాబు), వైస్ ఎంపీపీ ముదునూరి సురేష్ రాజు,మరొక వైస్ ఎంపీపీ సత్యం మదన్మోహన్, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న,జడ్పిటిసి చల్లమళ్ళ వెంకటలక్ష్మి, మండల సలహాదారులు చల్లమళ్ళ సుజీ రాజు,కో ఆప్షన్ సభ్యుడు షేక్ ఇబ్రహీం లను మెమొంటోలతోనూ, సాలువాలతోనూ,పూల మాలల తోనూ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అంకం శ్రీనివాస్,ఎంఈఓ స్వామి నాయక్, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, మండల వ్యాప్తంగా ఉన్న పంచా యతీ కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పేకాట సావరంపై పోలీసుల దాడి



**సీతానగరం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం మిర్తి పాడు గ్రామంలో పేకాట స్థావరంపై సీతానగరం పోలీసులు దాడి చేసి పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుండి ప్లేప్లేయింగ్ కార్డ్స్, 10,750 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసామని సీతానగరం ఎస్సై శ్రీను నాయక్ తెలియజేశారు.

# జనసేన నాయకుడు విజయశంకర్‌కు మాతృ వియోగం

**సీతానగరం, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో జనసేన పార్టీ మండల నాయకులు డాక్టర్ కారిచర్ల విజయ శంకర్ తల్లి కారిచర్ల మాలతి(62) గుండె పోటుతో కన్నుమూయడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. గ్రామ నాయకులు మరియు పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

# యువతి అదృశ్యంపై అంగర పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు



**అంగర, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన ధంగేటి లక్ష్మీ ప్రసన్న(19) గత నెల 31 తేదీ వ తేదీ సోమవారం కాలేజీకి వెళ్తున్నానని, తల్లికి చెప్పి ఇంటి వద్ద నుండి వెళ్ళింది. కానీ ఇంతవరకు ఆమె ఇంటికి రాకపోవడంతో ఆమె తల్లి అంగర పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేశారని ఎస్సై హరీష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నా కుమార్తె ధంగేటి లక్ష్మీ ప్రసన్న (19) వివిఎస్ఎమ్ కాలేజ్ రామచంద్రపురంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతుందని ఆమె ఇంతవరకు రాలేదని అంగర పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేశారని ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై. హరీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసినవారు సమాచారం తెలియజేయాలని ఎస్సై హరీష్ కుమార్ తెలిపారు. మొబైల్ నెంబర్....9440900770.

# పోస్టాఫీసు ద్వారా విదేశీ నగదు బదిలీ



### 30కి పైగా పోస్టాఫీసుల్లో రియా మనీ ట్రాన్స్‌ఫర్ సేవలు : పోస్టల్ సూపరింటెండెంట్ కే.శేషారావు

**మండపేట టౌన్, సెప్టెంబర్ 3, విశ్వం వాయిస్ న్యూస్ :** పోస్టాఫీసుల ద్వారా ఇక నుంచి అంతర్జాతీయ నగదు బదిలీ సంస్థ రియా మనీ ట్రాన్స్ ఫర్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు రాజమండ్రి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కే శేషారావు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో రాజమండ్రి తపాలా డివిజన్ పరిధిలోని 30కి పైగా పోస్టాఫీసుల్లో రియా మనీ ట్రాన్స్‌ఫర్ సేవలు ప్రారంభించామన్నారు. విదేశాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వలస ఉద్యోగులు, కార్మికులు స్వదేశంలోని తమ కుటుంబ సభ్యులకు పంపించే విదేశీ నగదును వేగంగా, సురక్షితంగా అందించేందుకు ఈ సేవలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. బ్యాంకులకు లేదా సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సమీపంలోని పోస్టాఫీసుల్లోనే ఈ సౌకర్యాన్ని వినియోగించు కోవచ్చన్నారు. రామచంద్రాపురం సబ్ డివిజన్ పరిధిలోని రామచంద్రాపురం, మండపేట, ద్రాక్షారామ, కోటిపల్లి, రాయవరం, పందలపాక, కపిలేశ్వరపురం తదితర ప్రాంతాల్లోని పోస్టాఫీసులతో పాటు డివిజన్ పరిధిలోని 30కి పైగా ప్రముఖ పోస్టాఫీసుల్లో రియా మనీ ట్రాన్స్‌ఫర్ సేవలు అందుబాటులో ఉన్నాయని శేషారావు తెలిపారు. విదేశాల నుంచి తమ కుటుంబ సభ్యులకు పంపే నగదును సులభంగా పొందేందుకు ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



# జిమ్ కాదు.. రోజూ ఆ ఒక్క పనిచేయడమే అందం రహస్యం..

### 41 ఏళ్ల వయసులో నయనతార ఫిట్‌నెస్ సీక్రెట్ ఇదేనట..



లేడీ సూపర్ స్టార్ నయనతార ఈసారి కన్నడ సూపర్ స్టార్ యశ్‌తో కలిసి వెండితెరపై సందడి చేసింది. చాలా కాలం తర్వాత అటు గ్లామరస్ లుక్స్.. ఇటు పవర్ ఫుల్ లుక్ లో కనిపించింది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' గ్యాంగ్‌స్టర్ డ్రామాలో గంగ పాత్రలో కనిపించి మెప్పించింది. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా సినీ పరిశ్రమలో ఉన్న నయనతార ఇప్పటికీ ఏమాత్రం తరగని అందంతోపాటు అభినయంతో మైమరపిస్తుంది. సౌత్ ఇండస్ట్రీలో లేడీ సూపర్ స్టార్ గా కొనసాగుతున్న ఈ అమ్మడు తాజాగా తన ఫిట్‌నెస్, బ్యూటీ సీక్రెట్ పంచుకుంది. మె కఠినమైన ఆహార నియమాలను గానీ, మితిమీరిన వ్యాయామాలను గానీ నమ్మదు. దానికి బదులుగా, తన బిజీ షెడ్యూల్‌లో కూడా ఎలాంటి అంతరాయాలు లేకుండా పాటించగలిగే ఆరోగ్యకరమైన అలవాట్లను ఆమె అలవర్చుకుంది. నయనతార తన శరీరాకృతిని కాపాడుకోవడానికి తన వ్యాయామ దినచర్యలో వెయిట్ ట్రైనింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తుంది. దీనితో పాటు, యోగా కూడా ఆమె దినచర్యలో భాగమే. కేవలం కొత్త సినిమాల కోసమే ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టకుండా వ్యాయామాన్ని తన రోజువారీ జీవనశైలిలో ఒక భాగంగా చేసుకోవడానికి ఇష్టపడుతుంది. సుదీర్ఘమైన షూటింగ్ రోజుల తర్వాత, యోగా ఆమె శరీరానికి విశ్రాంతినిచ్చి, తిరిగి ఎనర్జీని పొందడానికి సహాయపడుతుంది. ఆహారం విషయంలో నయనతార ఫిట్‌నెస్ ఆలోచనా విధానం చాలావరకు మార్చుకుందట. గతంలో తన డైట్‌ను చాలా కఠినమైన నియంత్రణగా భావించేది. అది తనకు అస్సలు ఇష్టం లేని ఆహారాలను తినేలా బలవంతం చేసేదని ఆమె అనుకునేదట. కానీ తర్వాత ఆ ఆలోచన మారింది. శరీరానికి అవసరమైన రకరకాల మంచి ఆహారాలను సరైన మోతాదులో తినడమే ఇప్పుడు ఆమె కొత్త పద్ధతిగా మార్చుకుంది. ప్రయాణాలలో, షూటింగ్ సెట్‌లలో ఎలాంటి ఆహారం అందుబాటులో ఉన్నప్పటికీ, నయనతార ఎల్లప్పుడూ ఇంట్లో వండిన సాదా భోజనాన్నే ఇష్టపడుతుంది. షూటింగ్‌కు వెళ్లేటప్పుడు ఇంటి నుండి ఆహారాన్ని తీసుకువెళ్లడం జంక్ ఫుడ్ తినాలనే కోరికలను తగ్గించడంలో సహాయపడుతుందని అన్నారు. అంతేకాకుండా ఇంట్లో చేసిన భోజనం ఆమె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఆహారంలో పండ్లు, కూరగాయలు, గుడ్లు , మాంసంతో కూడిన సమతుల్య ఆహారం తీసుకుంటుంది. నయనతార తన శరీరంలో సరైన నీటి శాతాన్ని (హైడ్రేట్)గా కాపాడుకోవడంపై కూడా చాలా శ్రద్ధ పెడుతుంది. ఇందుకోసం ఆమె తన ఆహారంలో గ్రీన్ టీ, తాజా జ్యూస్‌లు, సూప్‌లను తీసుకుంటుందట. కఠినమైన వ్యాయామాలు, బిజీ జీవనశైలి నుండి తన శరీరానికి పూర్తి విశ్రాంతి అవసరం కాబట్టి, ఈ నటి సరైన నిద్రకు కూడా ప్రాధాన్యత ఇస్తుంది. దాదాపు కచ్చితంగా 8 గంటలకు పైగానే నిద్రపోతుందట. అలాగే నీరు ఎక్కువగా తాగుతుందట.

# మరింత గ్రాండ్‌గా మారుతున్న ఎన్టీఆర్ "డ్రాగన్"..

### బాలీవుడ్ బిగ్ స్టార్ల పేర్లు?



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ హీరోగా ఇప్పుడు సెన్సేషనల్ దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో చేస్తున్న భారీ సినిమా డ్రాగన్ కోసం అందరికీ తెలిసిందే. ఎన్నో అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా మళ్లీ మరో రెండు వారాల్లో పునః ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఇక ఈ గ్యాప్ లో డ్రాగన్ పై పలు ఊహించని రూమర్స్ వినిపిస్తున్నాయి. ఈ సినిమా ఉండగా ఉండగా మరింత భారీ లెవెల్లోకి వెళుతున్నట్టు తెలుస్తోంది. ఆల్రెడీ బాలీవుడ్ సీనియర్ స్టార్ నటుడు అనీల్ కపూర్ ఈ సినిమాలో ఉన్న సంగతి తెలిసిందే. తన తర్వాత ఇప్పుడు బిగ్ స్టార్స్ షాహిద్ కపూర్ అలాగే ఆలియా భట్ లు పేర్లు కూడా ఈ సినిమా తారాగణంలో యాడ్ అయినట్టు తెలుస్తోంది. మరి ఇదే నిజం అయితే డ్రాగన్ మరింత లెవెల్ కి వెళ్లినట్టే అని చెప్పాలి. అలాగే నార్త్ బెల్ట్ లో వసూళ్లకు ఇది మరింత బూస్టప్ గా నిలిచే అవకాశం ఉంది. షాహిద్ మలయాళ నటుడు టోవినో థామస్ కి రీప్లేస్ గా కనిపిస్తాడని టాక్. కానీ ప్రస్తుతానికి అయితే ఇందులో ఎలాంటి నిజం లేదు. సో దీనిపై అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే మైత్రి మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ నిర్మాణం వహిస్తున్నారు.

# నాని, కీర్తి సురేశ్ మాస్ మేజిక్

### 'ఏషనాగుల' సరికొత్త రికార్డ్.. 5 రోజుల్లో 50ఎం+ వ్యూస్!




నేచురల్ స్టార్ నాని, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'ది ప్యారడైజ్'. ఈ సినిమా నుంచి విడుదలైన సెకండ్ సింగిల్ 'ఏషనాగుల' డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. విడుదలైన ఐదు రోజుల్లోనే ఏకంగా 50 మిలియన్లకు పైగా వ్యూస్‌ను సొంతం చేసుకుని, తెలుగు చిత్ర పరిశ్రమలోనే అత్యంత వేగంగా ఈ మార్కును చేరుకున్న పాటగా చరిత్ర సృష్టించింది.

**యూట్యూబ్ గ్లోబల్ చార్ట్స్‌లో ట్రెండింగ్**

రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన మాస్ బీట్, శ్యామ్ కాసర్ల రాసిన సాహిత్యం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. జాంగిరెడ్డి, ప్రభ గానం పాటకు మరింత ఊపు తెచ్చింది. పాటలో నాని, కీర్తి సురేశ్ స్క్రీన్ ప్రెజెన్స్, సందీప్ మాస్టర్ కొరియోగ్రఫీ ప్రేక్షకులను కట్టిపడేస్తున్నాయి. ప్రస్తుతం ఈ పాట యూట్యూబ్ గ్లోబల్ చార్ట్స్‌లో అగ్రస్థానంలో ట్రెండ్ అవుతోంది. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి, సంపూర్ణేష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'ది ప్యారడైజ్' చిత్రం 2026 సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# దుల్కర్ సల్మాన్ 'ఐ యామ్ గేమ్' : మొదటి రోజు టాక్ ఎలా ఉంది?




మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'ఐ యామ్ గేమ్' నేడు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. 'ఆర్డీఎక్స్' ఫేమ్ నహాస్ హిదాయత్ దర్శకత్వంలో, వేఫేరర్ ఫిల్మ్స్ బ్యానర్‌పై రూపొందిన ఈ ప్రాజెక్ట్ దుల్కర్ కెరీర్‌లో 40వ సినిమా కావడంతో విడుదలకు ముందే మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అయితే, థియేటర్లలో సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి ప్రస్తుతం మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది.

**మెప్పించిన యాక్షన్.. నిరాశపరిచిన ద్వితీయార్థం**

ఈ చిత్రంలో 'డాన్ జాన్' అనే లక్కీ గ్యాంబ్లర్ పాత్రలో దుల్కర్ సల్మాన్ కనిపించారు. ప్రథమార్ధం ఆసక్తికరమైన ఫాంటసీ అంశాలు, వేగవంతమైన యాక్షన్ బ్లాక్స్‌తో సాగిపోతుంది. ముఖ్యంగా బార్ ఫైట్, ఇంటర్వెల్ యాక్షన్ సీన్లలో దుల్కర్ స్క్రీన్ ప్రెజెన్స్ ఆకట్టుకుంది. మిస్కిన్, ఆంటోనీ వర్గీస్, కాయదు లోహర్ తమ పాత్రల పరిధి మేరకు నటించగా, జేక్స్ బిజోయ్ నేపథ్య సంగీతం పోరాట సన్నివేశాలకు ప్రధాన బలంగా నిలిచింది. అయితే, ద్వితీయార్ధంలో కథనం నెమ్మదించడం, బలహీనమైన సంభాషణలు, ఎడిటింగ్ లోపాలు సినిమా వేగాన్ని దెబ్బతీశాయి. దుల్కర్ అభిమానులను ఆయన మేనరిజమ్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఆకట్టుకున్నప్పటికీ, రెగ్యులర్ ప్రేక్షకులను ఈ చిత్రం పూర్తి స్థాయిలో మెప్పించలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**తెలుగు షోలు రద్దు.. రాత్రికి ప్రారంభమయ్యే ఛాన్స్**

మరోవైపు, తెలుగు వెర్షన్ ప్రదర్శనలకు సంబంధించి తొలిరోజు సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో మార్నింగ్, మ్యాట్నీ షోలను రద్దు చేయాల్సి వచ్చింది. సమస్యను పరిష్కరించి, నైట్ షోల నుంచి తెలుగు ప్రదర్శనలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# మళ్లీ వీవీఎస్ లక్ష్మణ్‌కే అవకాశం.. కేంద్రం ఆమోదం



మరో రెండు వారాల్లో మొదలయ్యే ఆసియా క్రీడల్లో టీమ్ఇండియా తలపడనున్న సంగతి తెలిసిందే. నేరుగా క్వార్టర్ ఫైనల్‌లో తలపడనుంది. జపాన్ వేదికగా ఈ క్రీడలు జరగనున్నాయి. అయితే, భారత జట్టుతోపాటు కోచ్‌గా వెళ్లేందుకు వీవీఎస్ లక్ష్మణ్‌కు మళ్లీ అవకాశం వచ్చింది. ఈ మేరకు కేంద్ర క్రీడల శాఖ ఆమోదం తెలిపింది. కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్ జాబితాలో వీవీఎస్ లక్ష్మణ్ పేరూ ఉంది. టీమ్ఇండియా ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ స్థానంలో లక్ష్మణ్ ఈ బాధ్యతలను నిర్వర్తిస్తాడు. దాదాపు అదే సమయంలో వెస్టిండీస్‌తో వన్డే సిరీస్‌లో భారత్ తలపడనుంది. అందుకే, గంభీర్ స్వదేశంలోనే ఉంటాడని బీసీసీఐ పేర్కొంది.

**లక్ష్మణ్ టీమ్ ఇదీ..**

ఆసియా క్రీడలకు లక్ష్మణ్ కోచ్‌గా వెళ్లడం ఇది వరుసగా రెండోసారి. 2023లో చైనా వేదికగా జరిగిన పోటీలకూ లక్ష్మణే మార్గదర్శకుడు. అప్పుడు టీమ్ఇండియా బంగారు పతకం నెగ్గింది. ఆ తర్వాత పలు సిరీస్‌లకూ గంభీర్ స్థానంలో లక్ష్మణ్ కోచ్‌గా వెళ్లాడు. ఈసారి ఆసియా క్రీడలకు తన కోచింగ్ బృందంలో మాజీ క్రికెటర్లు సునీల్ జోషి, హృషికేశ్ కనిత్కర్, శుభదీప్ ఘోష్‌కు అవకాశం దక్కింది. మరూఫ్ ఫజందార్‌ను టీమ్ లీడర్‌గా కేంద్రం నియమించింది. ఇప్పటికే టీ20 జట్టును ప్రకటించిన సంగతి తెలిసిందే. శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తుండగా.. అతడికి డిప్యూటీగా తెలుగు కుర్రాడు తిలక్ వర్మకు అవకాశం దక్కింది. ఇందులో వైభవ్ సూర్యవంశీ, జస్‌ప్రీత్ బుమ్రా కూడా ఉన్నారు. ఆసియా క్రీడల్లో అతిపిన్న వయస్కుడైన క్రికెటర్‌గా వైభవ్ నిలిచాడు. మరోవైపు హెడ్ కోచ్ అమోల్ ముజుందార్, అవిష్కార్ సాల్వి నేతృత్వంలోనే భారత అమ్మాయిల జట్టు ఆసియా క్రీడల బరిలోకి దిగనుంది.

### ఇంపాక్ట్‌గా కాదు..

# పూర్తిస్థాయి ప్లేయర్‌గానే ధోని



ఇంపాక్ట్ రూల్ వద్దు అని కొందరు.. కావాలని మరికొందరు వాదిస్తున్నారు. దీనిపై ఇప్పటికే పది ఫ్రాంచైజీల కెప్టెన్ల అభిప్రాయాలను బీసీసీఐ తీసుకున్న సంగతి తెలిసిందే. వచ్చే సీజన్‌లో ఆ రూల్‌ను ఉంచుతారా? లేదా? అనేది బోర్డు నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఒకవేళ ఇంపాక్ట్ రూల్‌ను తీసేస్తే ఎంఎస్ ధోని ఐపీఎల్ భవితవ్యం కూడా ఇబ్బందుల్లో పడుతుందనే వాదన వినిపిస్తోంది. గత సీజన్‌లో గాయం కారణంగా ఒక్క మ్యాచ్‌లోనూ అతడు ఆడలేదు. వచ్చే ఎడిషన్‌లో తప్పకుండా బరిలోకి దిగుతాడని సీఎస్‌కే అభిమానులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంపాక్ట్ రూల్ లేకపోతే పరిస్థితి ఏంటనేదీ పలువురిలో ఆందోళన కలిగిస్తోంది. అయితే, చెన్నై సూపర్ కింగ్స్ మాజీ ఆటగాడు బద్రినాథ్ మాత్రం ధోని అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పాడు. ఐపీఎల్ 2027 సీజన్‌లో తలా తప్పకుండా ఆడతాడని వెల్లడించాడు. "ధోని నాతో వ్యక్తిగతంగా ఓ మాట చెప్పాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా కాదు.. ఫుల్‌టైమ్ వికెట్ కీపర్‌గానే ఆడతానని అన్నాడు. దానర్థం 20 ఓవర్లూ అతడు మైదానంలో ఉంటాడు. ఒకవేళ నిజంగానే ధోని బరిలోకి దిగితే సీఎస్‌కేకు ప్రయోజనమే. కానీ, ధోని శరీరం అంత సమయం సహకరిస్తుందా? అనేది అనుమానం. గతంలో ఫ్లెమింగ్ ఇదే మాట అన్నట్లు గుర్తు. ధోని ఎక్కువగా 16 లేదా 17వ ఓవర్ తర్వాత బ్యాటింగ్‌కు వస్తుంటాడు. అతడి పాత్ర చాలా పరిమితంగానే ఉంటుంది" అని బద్రినాథ్ అన్నాడు.

**సీఎస్‌కేకు దూబే బౌలింగ్ అవసరంలేదు..**

"శివమ్ దూబే బౌలింగ్ భారత్‌కు అవసరం కానీ.. సీఎస్‌కేకు కాదు. అతడి విషయంలో ఇంపాక్ట్ రూల్‌ను వినియోగించాల్సిన పనిలేదు. అలాగే అకీల్ హుస్సేన్‌ను తప్పకుండా ప్లేయింగ్ 11లో ఉంచాలి. సీఎస్‌కే మాత్రం అతడిని ఇంప్టాక్‌గానే తీసుకొస్తోంది. ఒకవేళ బ్యాటింగ్‌లో ఇబ్బంది పడినప్పుడు అదనంగా మరో బ్యాటర్‌ను తీసుకొంటోంది. దీంతో అకీల్ సేవలను కోల్పోయిన పరిస్థితులను మనం చూశాం. ఇక్కడ ఇంపాక్ట్ రూల్‌ను తప్పుబట్టేందుకు ఏమీ లేదు. సరిగ్గా వినియోగించుకొనే వ్యూహం ఆయా జట్లకే ఉండాలి" అని బద్రినాథ్ వ్యాఖ్యానించాడు.

# అన్ని జట్లూ ఇలానే చేస్తే బాగుండు..

### పాక్ 'లింక్డిన్ పోస్టు'పై బట్లర్ సెటైర్



పాకిస్థాన్ క్రికెట్ తీరు విమర్శలకు గురవుతూనే ఉంది. ఇంగ్లాండ్ చేతిలో ఘోర ఓటమి, ఏడుగురిపై వేటు వేయడంతో ఆ జట్టు మాజీలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇప్పుడు ఫీల్డింగ్ కోచ్ పదవి కోసం లింక్డిన్‌లో యాడ్ ఇవ్వడమూ సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురైంది. నెటిజన్లు తీవ్ర స్థాయిలో తమ కామెంట్లతో రెచ్చిపోయారు. ఈ క్రమంలో ఇంగ్లాండ్ ఆటగాడు జాస్ బట్లర్ కూడా కాస్త సెటైరికల్‌గా స్పందించాడు. అన్ని జట్లూ ఇలానే చేస్తే బాగుంటుందని పాక్‌పై వ్యంగ్యాస్త్రాలు గుప్పించాడు. "పాకిస్థాన్ ప్రకటనను సమర్థించడానికి ప్రయత్నిస్తున్నా. తమ కొత్త ఫీల్డింగ్ కోచ్ నియామకం కోసం పాక్ సంప్రదాయ, ఆధునిక వ్యూహాన్ని అనుసరించిందని అనుకుంటున్నా. అందుకోసమే లింక్డిన్‌లో పోస్టు చేసింది. ప్రస్తుత రోజుల్లో అన్ని జట్లూ ఇలాంటి జాబ్ ప్రకటనలు ఇవ్వాలి. ఇంగ్లాండ్ కూడా అదే చేస్తుందేమో నాకైతే తెలియదు" అని బట్లర్ వ్యాఖ్యానించాడు. పాకిస్థాన్ ఫీల్డింగ్ కోచ్‌గా షేన్ మెక్‌డార్మెట్ పదవీకాలం గత వారమే ముగిసింది. సాధారణంగా అధికారికంగా నియామకం కోసం దరఖాస్తులను ఆహ్వానించడం పరిపాటి. కానీ, లింక్డిన్‌లో పోస్టు చేయడం మాత్రం అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకోవాలని పాక్ బోర్డు ఆ పోస్ట్‌లో పేర్కొంది.

### ఘోరంగా ఓడింది గాక..

# తిరిగి భారత్‌పైనే పాక్ అక్కసు



ఇంగ్లాండ్ చేతిలో వరుసగా రెండు టెస్టుల్లో ఘోర ఓటమిపాలైన పాకిస్థాన్ జట్టుపై ఆ దేశ మాజీలు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. పాక్ క్రికెట్ బోర్డు సరిగా లేకపోవడం వల్లే పాక్ క్రికెట్ పతనమవుతోందంటూ మండిపడ్డారు. అయితే, పీసీబీ చీఫ్ మోసిన్ నఖ్వీ మాత్రం తమ జట్టు ప్రదర్శనను సమర్థించుకుంటున్నాడు. అదే సమయంలో జట్టు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ఇటీవల కొన్ని పెద్ద జట్లు.. చిన్న టీమ్‌ల చేతిలో ఓడిన విషయాన్ని ప్రస్తావించాడు. "మిమ్మల్ని ఒక విషయం అడుగుతాను. ఇటీవల కాలంలో చిన్న జట్ల చేతిలో పెద్ద జట్లు ఓడిపోయాయి. అంతటితో అక్కడ క్రికెట్ ముగిసిపోయిందా? మాకు ఎవరైతే అవసరమో వారిని కచ్చితంగా జట్టులోకి తీసుకుంటాం. ఎవరైనా రాణించకపోతే లేదా ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయకపోతే మేమేం చేయగలం? మాకు ప్రతి మ్యాచ్, ప్రతి సిరీస్ ఎంతో ముఖ్యం. కచ్చితంగా టెస్ట్ మ్యాచ్‌లో జరిగిన దానిని తప్పుగా పరిగణించలేం. మేం ఈ రెండు మ్యాచ్‌లలో ఓడిపోయాం. కానీ, దేవుని దయతో వన్డేలు, టీ20ల్లో మాదిరిగానే రాబోయే రోజుల్లో టెస్టుల్లో పురోగతి సాధిస్తామని నమ్ముతున్నా. నేను విమర్శలకు ఎప్పుడూ భయపడలేదు, ఇకపై కూడా భయపడను. నేను పీసీబీ చీఫ్‌గా వచ్చినప్పటి నుంచి క్రికెట్ నాశనమైందని అనేవారు ఒక విషయం గుర్తుంచుకోవాలి. మేం ఈ కోచింగ్ బృందాన్ని తీసుకురాకముందు జట్టు ర్యాంకింగ్స్ ఎలా ఉండేవో చూడండి. వన్డేల్లో ఎనిమిదో స్థానంలో ఉండేవాళ్లం. ఇప్పుడు ఐదో స్థానంలో ఉన్నాం. అలాగే టీ20ల్లో తొమ్మిదో స్థానం నుంచి ఆరో స్థానానికి వచ్చాం" అని మోసిన్ నఖ్వీ వ్యాఖ్యానించాడు. ఈ ఏడాది జూన్‌లో ఐర్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో భారత్ ఓటమిపాలైన విషయం తెలిసిందే. కొన్ని రోజుల క్రితం ముక్కోణపు టీ20 సిరీస్‌లో నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికాకు చుక్కెదురైంది. ఈ ఫలితాలను ఉద్దేశించే మోసిన్ నఖ్వీ తాజాగా ఈ తరహా వ్యాఖ్యలు చేశాడని, పీసీబీ చీఫ్ జట్టును సరైన దారిలో నడిపించకుండా భారత్‌పై అక్కసు వెళ్లగక్కడం సరికాదంటూ క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com